
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పల్నాడు జిల్లా వార్తలు
5
సోమవారం 11 నవంబరు 2024





పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న పవన్ కళ్యాణ్



అమరావతి అభివృద్ధి పరుగులు

- రూ.15వేల కోట్ల ప్రతిపాదనలకు ముందడుగు
- ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి నిధులు
- రాజధాని నిర్మాణ ప్రణాళికల రూపకల్పనకు ప్రభుత్వం ఆదేశాలు
- ఆదివారం జీవో జారీ చేసిన పురపాలక శాఖ

రాజధాని అమరావతి నిర్మాణం ఇకపై పరుగులు పెట్టనుంది. రాజధాని నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు నుంచి అందనున్న నిధుల వినియోగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ సీఆర్డీఏకు తాజాగా జీవో జారీ చేసింది. అమరావతి నగర అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన ప్రణాళికలు అమలు చేయాలని సీఆర్డీఏకు పురపాలక శాఖ ఆ జీవోలో పేర్కొంది.

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధానిగా అ మరావతిని అభివృద్ధి చేయాలని, అందుకోసం చేపట్టాల్సిన ప్రణాళికలను సిద్ధం చేయాలని సీఆర్డీఏను ప్రభుత్వం ఆదేశించింది. రాజధాని అమరావతికి ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు సంయుక్తంగా రూ.15వేల కోట్ల రుణ సహకారాన్ని అందించనున్నట్లు ఆ జీవోలో ప్రభుత్వం స్పష్టంచేసింది. ఆ నిధులతో రాజధానిలో అత్యున్నత ప్రమాణాలతో మౌలిక సదుపాయాల, వసతులు, హరిత నిర్మాణాలు, ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉండేలా సుస్థిరాభివృద్ధి కార్యాచరణను చేపట్టాలని పేర్కొంది. రాజధానిలో ప్రధాన రహదారులు, తప్పనిసరి అవసరాలకోసం వినియోగించే యుటిలిటీ డక్టులు, వర్షపు నీరు, వరద నీటి ప్రవాహాన్ని నియంత్రించేలా డ్రెయిన్లు, వరద కాలువలు నిర్మించాలని జీవోలో స్పష్టం చేసింది. ల్యాండ్ పూలింగ్ స్కీమ్ జోన్లలో హరిత క్షేత్రాలు ఏర్పాటుచేయాలని, 24 గంటలూ స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, మానవ వ్యర్థాలను నిర్వహించే సీవరేజ్ వ్యవస్థను నిర్మించాలని, హరిత నియమావళికి అనుగుణంగా ప్రభుత్వ భవనాలు నిర్మించాలని, భవనాల పటిష్టతను పెంపొందించాలని, అందుకనుగుణంగా కొత్త పద్ధతుల్లో నిధుల సమీకరణ పద్ధతులను అవలంబించాలని పురపాలక శాఖ సీఆర్డీఏకి తెలిపింది.

● సుస్థిరాభివృద్ధి దిశగా అడుగులు

రాజధాని అమరావతి సుస్థిరాభివృద్ధికి సీఆర్డీఏ ప్రతిపాదనలు సమర్పించగా కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ ఆమోదించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ ప్రతిపాదనలకు ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి కూడా ఆమోదం లభించినట్లు తెలిపింది. ప్రోగ్రామ్ ఫర్ రిజల్ట్స్(పీ ఫర్ ఆర్), రిసల్ట్ బేస్డ్ లెండింగ్(ఆర్‌బీఎల్) కార్యక్రమాల కింద ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు చెరో 800 మిలియన్ డాలర్ల నిధులు అందించనున్నాయి. మిగిలిన నిధులు కేంద్ర సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చుకోనున్నామని తెలిపింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం పొందేందుకు ఏపీ సీఆర్డీఏ కమిషనర్‌కు అధికారం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అభివృద్ధి ప్రణాళికల ఆధారంగా దశలవారీగా బ్యాంకుల నుంచి నిధుల పొందే అవకాశం ఉండడంతో అందుకోసం ప్రత్యేక బ్యాంకు ఖాతా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతి నిర్మాణ ప్రణాళిక కోసం బడ్జెట్లో ప్రత్యేక కేటాయింపులతో పాటు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ మొత్తం కార్యక్రమం, ప్రణాళికలు సీఆర్డీఏ కమిషనర్ అదీనంలో జరగనున్నట్లు జీవోలో పురపాలక శాఖ స్పష్టం చేసింది.



సభలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు తదితరులు

అటవీ సంరక్షణలో.. అధికారులకు స్వేచ్ఛ

- అమరవీరులను స్మరించుకోవడం మన బాధ్యత
- భావితరాలు గుర్తుంచుకునేలా విగ్రహాల ఏర్పాటు
- భవనాలకు అమర వీరుల పేర్లు
- అటవీ సంపదను నాశనం చేస్తే కఠిన చర్యలు
- టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేసే అవకాశం
- చెట్ల నరికివేతపై వాల్టా చట్టం కింద చర్యలు
- సరస్వతి భూముల్లో అక్రమాలపై విచారణ చేపడతాం
- అటవీ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

గుంటూరు(తూర్పు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిధులు, సిబ్బంది కొరతను అధిగమించి అటవీ శాఖను అభివృద్ధి పథంలో నిలుపుతాం. వనరులను పరిరక్షించి అటవీ సంపదను కాపాడి భవిష్యత్తు తరాలకు అందజేయడం బాధ్యతగా భావిస్తున్నాను. అడవుల రక్షణకు అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాం. ప్రకృతి వనరుల దోపిడీని అరికట్టేందుకు ఇప్పటికే టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశాం. ఆ నంబర్‌కి కాల్ చేస్తే ఇతర శాఖల సిబ్బందితో సమన్వయం చేసుకుని అడ్డగోలు దోపిడీకి అడ్డుకట్ట వేస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ఆదివారం గుంటూరు అరణ్య భవన్‌లో జరిగిన రాష్ట్ర అటవీ అమర వీరుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని స్మారక స్థూపం వద్ద అటవీశాఖ ఉన్నతాధికారులతో కలసి అమర వీరులకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం అమరవీరుల (మిగతా 6వ పేజీలో..)



అమవీరుల కుటుంబసభ్యులకు పండ్లు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

అటకెక్కిన పథకాలు.. కూటమిపైనే ఆశలు

పల్నాడు జిల్లాలోని నీటి పథకాలపై వైసీపీ పాలనలో నీలి నీడలు అలముకున్నాయి. తాగు.. సాగు నీటి అవసరాలు తీర్చే ప్రాజెక్టులను ఆటకెక్కించింది. నిధుల కేటాయింపులో ఐదేళ్లు మొండిచేయి చూపింది. ప్రాధాన్యం కలిగిన తాగు, సాగు నీటి పథకాల పనులు సర్వే స్థాయి దాటలేదు. వాటర్ గ్రిడ్‌పైనా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దశాబ్దాల నాటి కల వరికపూడిశెల ఎత్తిపోతల పథకం నిర్మాణం కలగానే మిగిలింది. పల్నాడు కరువు పథకం పనుల ఊసే ఎత్తలేదు. బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు కాగితాలకే పరిమితమైంది. నీటి పథకాలకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయింపులు జరగకపోవడంతో పల్నాడు వాసులు తీవ్ర అసంతృప్తితో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. నీటి పథకాల పూర్తికి కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్‌లో ఆయా ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు ఉంటాయని ఆశిస్తున్నారు. బడ్జెట్‌లో జిల్లాకు ఎటువంటి ప్రాధాన్యత కల్పిస్తుందో చూడాలి.

- నీటి పథకాలకు నిధుల కేటాయింపు జరిగేనా..?
- వైసీపీ పాలనలో ఐదేళ్లు నిధుల ఊసేలేదు
- నేటి బడ్జెట్‌పై జిల్లా వాసుల ఆసక్తి



గోదావరి జలాల తరలింపు పథకం శంకుస్థాపన శిలాఫలకం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గోదావరి జలాల తరలింపు నాగార్జున సాగర్ కుడి కాలువ ఆయకట్టులో నెలకొనే సాగు నీటి సంక్షోభం నివారణకై గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా తొలిదశలో గోదావరి జలాలను కుడి కాలువకు తరలించేందుకు నాడు తెలుగుదేశం ప్రభుత్వం పథకం రూపొందించబడింది. ఈ పథకానికి వైఎస్ఆర్ పల్నాడు కరువు నివారణ పథకంగా పేరు మార్చిన వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు. పల్నాడు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు కుడి కాలువ ద్వారా 11.11 లక్షల ఎకరాలను సాగునీరు అందించే పథకం పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం రూ 6360 కోట్లు నిధులు వ్యయం అంచనాలతో పనులు చేపట్టింది. సీఎం చంద్రబాబు నాయుడు పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. పథకం నిర్మాణానికి నిలిచిపోయిన భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నదుల అనుసంధానంలో భాగంగా గోదావరి జలాలు కుడికాలువకు తరలింపుపై సమీక్షించారు. నిపుణులు ఈ పథకం వ్యయం 30 శాతం పెరుగుతుందని అంచనా వేశారు. ఈ బడ్జెట్‌లో ఈ పథకం నిర్మాణానికి నిధులు కేటాయింపు జరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు.


గురజాల నియోజకవర్గంలో సాగు నీటి ఎద్దడి నివారణ కోసం తంగెడ, మాచవరం ఎత్తి పోతల పథకాలను నిధుల కొరత వెంటాడుతోంది. దాదాపు 21,473 ఎకరాలను సాగు నీరు అందించేందుకు ఈ పథకాలను రూపొందించారు. ఈ పథకాల పనులు సర్వే దశలోనే ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం నిధుల కేటాయింపును విస్మరించింది. సర్వే పనులు కూడా నిలిచిపోయాయి. తంగెడ, మాచవరం ఎత్తి పోతల పథకాలు పనులు పట్టాలెక్కించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

జిల్లాలో తాగునీటి సరఫరా సమస్యను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో ప్రకటించిన వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణం నేటికి చేపట్టలేదు. ఎంతో అర్భాటంగా ఈ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం ప్రకటించి నిర్మాణాన్ని విస్మరించింది. వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణానికి రూ 1,200 వ్యయం అవుతుందని అంచనా వేశారు. 611 గ్రామాలకు నీరు అందించే బృహత్తర పథకం నిర్మాణంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. బుగ్గవాగు నుంచి 78 గ్రామాలకు తాగునీరు అందించేలా పథకాన్ని రూపొందించారు. మరో 533 గ్రామాలకు తాగునీటిని సాగర్ జలాలను సరఫరా చేసే విధంగా వాటర్ గ్రిడ్‌ను నిర్మించాల్సి ఉంది. ఈ పథకం పనులు ప్రారంభం కాలేదు. పనులు టెండర్ దశలోనే ఉన్నాయి. బడ్జెట్‌లో అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

తాగు, సాగు నీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలోని బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంచాలని దశాబ్దాలుగా జిల్లా వాసులు కోరుతున్నారు. ఈ పనులు మాత్రం చేపట్టడంలేదు. నాడు తెలుగుదేశం ప్రభుత్వం బుగ్గవాగు అభివృద్ధికి రూ 202 కోట్లు మంజూరు చేసింది. బుగ్గవాగు సామర్థ్యాన్ని 3.5 టీఎంసీల నుంచి 7 టీఎంసీలకు పెంచుతామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించి చతికిల పడింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనుల వ్యయం అంచనాలు, డిజైన్‌లు రూపొందించే ఏజన్సీని నియమించే టెండర్‌ను జలవనరుల శాఖ ఖరారు చేయలేక పోయింది. బుగ్గవాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ దుర్గి ప్రాంతంలో కుడి కాలువ 27 నుంచి 33వ కిలోమీటర్ మధ్యలో ఉంది. దీని నీటి నిల్వ సామర్థ్యం 3.46 టీఎంసీలు. డెడ్ స్టోరేజి 1.69 టీఎంసీలు కాగా 1.77 టీఎంసీల నీటిని వినియోగించుకోచ్చు. సామర్థ్యాన్ని పెంచడం ద్వారా తాగు, సాగునీటి అవసరాలు తీర్చవచ్చన్న ప్రతిపాదనలు దశాబ్దాలుగా ఉన్నాయి. రిజర్వాయర్‌ను 3.46 టీఎంసీల నుంచి 4.77 టీఎంసీలకు పెంచాలని టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు నిపుణుల కమిటీ కూడా నాడు అమోదం తెలిపింది. రూ 424 కోట్ల వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించారు. రూ 202 కోట్లు నిధులు కూడా మంజూరు చేసింది. గత ప్రభుత్వం పనులు చేపట్టకుండా వదిలేసింది. బుగ్గవాగు సామర్థ్యం పెంపుపైనే తాగు నీటి పథకాల అభివృద్ధి అధారపడి ఉంది. గురజాల, మాచర్ల నియోజకవర్గాలలో ప్రజలు వేసవిలో తాగునీటికి తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. బుగ్గవాగు సామర్థ్యం పెంచితే ఆయా నియోజకవర్గాలలో ఏడాది పొడవునా తాగునీరు అందించే అవకాశం ఉంటుంది. జిల్లాలోని గ్రామాలలో తాగునీటి సమస్యలు పరిష్కారం, ప్రతి వ్యక్తికి 55 లీటర్ల తాగునీరు అందించాలన్నది కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జలజీవన్ మిషన్ పథకం లక్ష్యం. బోర్ల నీటి సరఫరాను నిలిపి వేసి సాగర్ నీటిని అందించాలన్న దిశగా ఈ మిషన్ పనులు సాగుతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ 209 కోట్ల వ్యయంతో జలజీవన్ మిషన్ పనులు చేపట్టారు. కాగా పల్నాడు వాటర్ గ్రిడ్ పథకాన్ని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. రూ. 1500 కోట్ల వ్యయంతో తాగునీటి పథకాలను అభివృద్ధి చేసి బుగ్గవాగు నుంచి పైపు లైన్ ద్వారా నీటిని గ్రామాలకు సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇలా జల్‌జీవన్ మిషన్, వాటర్ గ్రిడ్ పథకాలు బుగ్గవాగు సామర్థ్యం పెంపుపై అధారపడి ఉన్నాయి. తాగు, సాగు నీటి అవసరాలను తీర్చే బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు పనులు కాగితాలల్లోనే పరిమితం అవడం పట్ల జిల్లా వాసులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బుగ్గవాగు సామర్థ్యం పెంపునకు సంబంధించిన పనులు వేగ వంతం చేసి పనులు చేపట్టా లని ప్రజలు కోరుతున్నా రు. పల్నాడు జిల్లాలో ప్రాధాన్యం కలిగిన నీటి పథకాలను పూర్తి చేయాలని జిల్లా వాసులు కోరుతు న్నారు.

మాచర్ల నియోజకవర్గానికి అత్యంత ప్రాధాన్యం కలిగిన వరికపూడిశెల ప్రాజెక్టు విషయంలోనే వైసీపీ ప్రభుత్వం హయాంలో పథకం పనులు అడుగుకూడా ముందుకు సాగలేదు. వరికపూడిశెల ప్రాజెక్టు రెండు దశల్లో నిర్మాణం చేపట్టి వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి మండలాల్లో సాగు నీరు ఇచ్చేందుకు రూపొందించారు. మొదటి దశలో వెల్దుర్తి మండలంలోని 24,900 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రాజెక్టు నిర్మించాలి. ఈ పనులు ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందాన ఉన్నాయి. మొదటి దశ పనులు కోసం నిధులు విడుదల చేయలేదు. రెండవ దశలో చేపట్టే పనులు సర్వే దశలో ఉన్నాయి. ప్రాజెక్టును పూర్తి చేస్తే వెల్దుర్తి మండలంలోని 24,900 ఎకరాలు, దుర్గి, బొల్లాపల్లి మండలాల్లోని 48,236 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. వరికపూడిశెల ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయించి పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. వరికపూడి శెలను పూర్తి చేస్తామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. నిధుల కేటాయింపునకు వారు కృషి చేయాల్సి ఉంది.

వరికపూడిశెల కల సాకారం అయ్యేనా..



వరికపూడిశెల నిర్మించే ప్రదేశం

తీరం.. జనసంద్రం

- పోటెత్తిన పర్యాటకులు, భక్తులు
- సెలవుదినం కావడంతో పెరిగిన సందర్శకులు
- వాహనాలతో కిక్కిరిసిన పార్కింగ్ ప్రదేశం
- ముమ్మరంగా పోలీసు బందోబస్తు
- సముద్రంలో గజ ఈతగాళ్ల గస్తీ



8

రుచీ.. శుచీ నేర్పుతారు

- వినూత్న వంటకాల తయారీలో ఫుడ్ సైన్స్ కళాశాల
- మార్కెటింగ్ మెలకువల్లోనూ శిక్షణ



క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో ప్రథమ స్థానం పొందిన గుంటూరు జిల్లా జట్టు



6

కొరతతో.. కొరవడిన పర్యవేక్షణ

- మూడు జిల్లాల్లోని మునిసిపాల్టీలలో సరిపడాలేని ఏఈలు
- ప్రగతి పనులపై కొరవడిన పర్యవేక్షణ
- ఏఈలుగా సచివాలయ ఎమినిటీ కార్యదర్శులు
- నియమాకాలపై కసరత్తు.. జిల్లాల వారీగా జాబితాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాలిటీల్లో ఏఈల కొరత కారణంగా ప్రగతి పనులు కుంటు పడుతున్నాయి. కాంట్రాక్టు ఉద్యోగ స్తులపై ఆధారపడి అభివృద్ధి పనులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో, ప్రగతి పనులపై పర్యవేక్షణ లేక, ఆయా పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకరంగా మారుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. చాలా మునిసిపాల్టీలలో ఖాళీగా ఉన్న ఏఈ పోస్టుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఆయా పోస్టులు ఇప్పట్లో భర్తీ అయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో, ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు మునిసిపల్ పరిపాలనా విభాగం చర్యలు చేపడుతోంది. పురపాలక సంఘాల్లోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఎమినిటీ కార్యదర్శులను తాత్కా లిక ఏఈలుగా నియమించే దిశగా కసరత్తు జరుగుతోంది.

ఏఈల ఖాళీలను గుర్తిస్తున్నాం

ఎమినిటీ కార్యదర్శులను తాత్కాలికంగా ఏఈలుగా నియమించే అంశంపై మునిసిపల్ శాఖ ఈఎన్‌సీ మరియన్నను వివరణ అడగ్గా ఇది వాస్తవమేనన్నారు. ముందుగా ఏఈల ఖాళీలను గుర్తిస్తున్నట్లు చెప్పారు. అర్హత కలిగిన ఎమినిటీ కార్యదర్శులను పని ఏర్పాట్లు కింద ఏఈలుగా నియమిం చేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

మూడు జిల్లాల్లో 35 పోస్టులు ఖాళీ

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాల్టీల్లో 35 వరకు ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏఈ పోస్టులు ఏపీపీఎస్‌ఈ ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. గత ఐదేళ్లలో ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడలేదు. దీంతో ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏఈలకు డీఈ ఈలుగా ప్రమోషన్‌లు రావడంతో ఖాళీల సంఖ్య పెరిగింది. ఏపీపీఎస్‌ఈ ద్వారా ఇప్పట్లో ఏఈల నియామకాలు జరిగే పరిస్థితులు లేవనే చెప్పాలి. ఇప్పటికిప్పుడు నోటిఫికేషన్ ఇచ్చినా ప్రక్రియ పూర్తయ్యే సరికి కనీసం ఏడాదిన్నర కాలం అవుతుందని అంచనా. నేరుగా ఏఈ పోస్టులు భర్తీ చేసే పరిస్థితులు లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలను పబ్లిక్ హెల్త్ శాఖ అన్వేషిస్తోంది. దీనిలో భాగంగా మునిసిపాల్టీలలో వార్డు సచివాలయల్లో ఎమినిటీ కార్యదర్శులుగా పనిచేస్తున్న వారితో ఏఈ పోస్టులు తాత్కాలికంగా భర్తీ చేయాలని ఆ శాఖ యోచిస్తోంది. మూడు జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించిన జాబితాలను ఇప్పటికే సిద్ధం చేశారు. సచివాలయాల్లో పనిచేస్తున్న ఎమినిటీ కార్యదర్శులకు విద్యా పరంగా ఏఈలుగా నియమించే అర్హత ఉంది. దీంతో, వీరిలో ప్రతిభావంతులను గుర్తించి వారికి మునిసిపాల్టీల్లో ఏఈలుగా వర్కింగ్ ఎరేంజ్‌మెంట్స్ కింద నియమించేందుకు పూర్తి స్థాయిలో కసరత్తు జరుగుతోంది. జాబితాను రూపొందించేందుకు ఓ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఇది కార్యరూపం దాల్చితే మునిసిపాల్టీలో ఏఈల కొరత తీరుతుందని చెప్పవచ్చు. ఖాళీగా ఉన్న డీఈ పోస్టుల భర్తీకి కూడా చర్యలు చేపట్టారు. ఏఈలకు డీఈ పోస్టుల్లో వర్కింగ్ ఎరేంజ్‌మెంట్స్ కింద నియమించనున్నారు.



దళితులను అణగదొక్కిన జగన్

● మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి



తాడేపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జగన్ దళితులకు మేనమామనని చెప్పుకొని దళితులను అణగదొక్కాడని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. ఆదివారం తాడేపల్లిలోని మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీదేవి మాట్లాడుతూ కార్పొరేషన్ నిధులతో దళితులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. జగన్ ప్రభుత్వంలో దళితులకు ఇచ్చే పథకాలు నిలిపివేశారన్నారు. అమరావతి అభివృద్ధి చెందితే దళితులకు ఉద్యోగాలు వస్తాయన్నారు. దళితులను చంపిన వైసీపీ నేతలు అనంతబాబు, నందిగం సురేష్‌కు జగన్ అండగా నిలిచారన్నారు. దళిత డాక్టర్ సుధాకర్ మాస్క్ అడిగితే వేధించి చంపారన్నారు. జగన్ అమలు చేసింది నవరత్నాలు కాదని, నవ మోసాలు అని వ్యాఖ్యానించారు. చదువుకున్న నన్ను గుర్తించి చంద్రబాబు అవకాశం కల్పించారని, డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేశ్, పురందరేశ్వరికి ధన్యవాదాలు చెప్పారు.

14న పెదకాకానికి షర్మిల రాక

పెదకాకాని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెదకాకానిలో ఏర్పాటు చేసిన నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల విగ్రహాల ఆవిష్కరణకు ఈ నెల 14న ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వస్తున్నట్లు గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలకా విజయ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా పెదకాకానిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర మాజీ కేంద్ర మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొంటారు. కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంతేటి యలమందరావు. జొన్నల వెంకటరెడ్డి. కండెల నాగరాజు. షేక్ నాగుల్ మీరా. బొందలపాటి పెద్ద రంగయ్య. బెజ్జం రాజేష్. బట్టు దిలీప్ పాల్గొన్నారు.

దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

పెదకాకాని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం ఈనెల 9న నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదల అయ్యాయి. ఈ మేరకు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, పరీక్షల కో ఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ ఫలితాలను విడుదల చేశారు. ఈ ప్రవేశ పరీక్షకు 201 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 188 మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో 184 మంది అర్హత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలు నవంబరు 15తో ముగుస్తాయని తెలిపారు. ప్రవేశ పరీక్షలో అర్హులైన వారి జాబితాను దూరవిద్య కేంద్రం వెబ్ సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అలాగే ఏపీ ఐసెట్ 2024లో అర్హత సాధించిన విద్యార్థులు ప్రవేశాలు పొందవచ్చన్నారు.

రేపు వెంకట నరసయ్య స్మారక వ్యాస రచన పోటీలు

పెదకూరపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడుకు చెందిన కవిబ్రహ్మ వేటుకూరి వెంకట నరసయ్య 75వ వర్ధంతి సందర్భంగా పెదకూరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈనెల 12వ తేదీ ఉదయం వ్యాస రచన పోటీలు జరుగుతాయని పెదకూరపాడు అభివృద్ధి వేదిక కన్వీనర్, ప్రజా కవి దర్శి శేషారావు ఆదివారం తెలిపారు. ఈ పోటీలు ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆరు నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవయుగ కవి చక్రవర్తి జాషువాపై ఈ వ్యాస రచన పోటీ జరుగుతుందని, ఆసక్తి గల వారు 8790682858 నంబరులో గాని, ప్రధానోపాధ్యాయులు వెంకట రమణ 8309754060 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పట్టుదలతో విజయాన్ని సాధించాలి

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో విజయాన్ని సాధించాలని రూరల్ డెవలప్‌మెంట్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం తాడికొండలోని ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో బాగు చేయించిన టీచర్స్ క్వార్టర్స్, ప్రహరీ గోడను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ముందుగా పాఠశాల గ్రంథాలయాన్ని పరిశీలించారు. పాఠశాల స్థాపించిన దగ్గర నుంచి ప్రస్తుతం వరకు ఉన్న విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధ్యాపకులు కేంద్రమంత్రికి వివరించారు. అంతేకాకుండా పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, టీచర్స్ కొరత, జీతభత్యాలు తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ జీవితంలో గొప్ప ఆశయాలను కలలు కనాలని సూచించారు. పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న పూర్వవిద్యార్థులను అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో పాఠశాల, కమ్యూనిటి హాల్, వాకింగ్ ట్రాక్ ఇలా కనీస వసతులు కల్పించే విధంగా 5 ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. అనంతరం పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, పూర్వ విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రెసిడెన్షియల్ స్కూల్ సెక్రటరీ మస్తానయ్య, బీజేపీ నాయకులు తాళ్ల శ్రీనివాస్ యాదవ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంతేటి బ్రహ్మయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, ధనేకుల సుబ్బారావు, సీనియర్ నాయకులు ఎడ్డూరి హనుమంతరావు, కంచర్ల శివరామయ్య, గుంటుపల్లి మధుసూదనరావు, చిగురుపాటి అనూప్, గడ్డిపాటి సాంబశివరావు, ఎంపీడీవో సమతావాణి, తహసీల్దార్ నాసరయ్య, ఎంఈవో తెనాలి ఇందిరా, పాఠశాల ప్రిన్సిపాల్ పి.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణలో.. అధికారులకు స్వేచ్ఛ

(5పేజీ తరువాయి)

కుటుంబాలను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. అటవీ సంపద దోచుకునే స్మగ్లర్లు, అరాచక మూకలకు ఎదురొడ్డి ప్రాణాలర్పించి వీర మరణం పొందిన అటవీ సిబ్బంది త్యాగాలు వృథా కానివ్వకుండా, వారి ఆశయాలకు అనుగుణంగా మనం పని చేయాలి. విధి నిర్వహణలో అశువులు బాసిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. రాజకీయ నాయకులు వాళ్ల ముందర కాళ్లకు బంధాలు వేయకుండా వాళ్ల పని వాళ్లను చేసుకోనిస్తే సరిపోతుందన్నారు.

సంజీవని పథకం ద్వారా నిధులు

అటవీ సంపద సంరక్షణలో కీర్తిచక్ర అవార్డు గ్రహీత దివంగత పందిళ్లపల్లి శ్రీనివాస్‌తో సహా 23 మంది అటవీ సిబ్బంది అమరులయ్యారు. అటవీ అధికారులు గంధపు చెక్కలు, ఏనుగు దంతాల స్మగ్లర్ వీరప్పన్‌తో పోరాటం చేసి శ్రీనివాస్ ప్రాణాలు వదిలారు. వీరి త్యాగాలను మనతో పాటు భావితరాలు మరిచిపోకూడదు. భవిష్యత్ తరాలు గుర్తించుకునేలా విగ్రహాల ఏర్పాటు చేస్తాం. నగర వనాలు, అటవీ శాఖ భవనాలకు వారి పేర్లు పెడతాం. అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడానికి తీసుకొచ్చిన సంజీవని పథకానికి పారిశ్రామికవేత్తలు, దాతలతో మాట్లాడి రూ. 5 కోట్ల నిధులు సమీకరిస్తాం. అమరవీరుల స్థూపాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. .

సరస్వతి పవర్ భూముల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేపడతాం...

లా అండ్ ఆర్డర్ సమస్యలతోపాటు సరస్వతి పవర్ భూముల్లో 76 ఎకరాలు అసైన్డ్ భూములు, చుక్కల భూములు ఆక్రమించేశారు. దీనితోపాటు వాగులు వంకల సంరక్షణ బాధ్యత కూడా ఉంది. అటవీ శాఖ అధికారులతో ఈ అంశంపై చర్చిస్తున్నాము. పవర్ ప్లాంట్ పరిధిలో గ్రీన్ జోన్ ఏర్పాటు చేయాలి. కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు కూడా లేవు. సరస్వతి పవర్ వ్యవహారంలో పాల్పడిన ఉల్లంఘనలన్నింటిని పరిశీలించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పవన్ కల్యాణ్ చెప్పారు.

చెట్ల నరికివేతపై వాల్టా చట్టం కింద చర్యలు

గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి పర్యటనల పేరిట ఇష్టానుసారం రోడ్ల పక్కన ఉన్న చెట్లు నరికేశారు. ఈ చర్యలు పర్యావరణ సమతుల్యతను దెబ్బతీశాయి. ఈ వ్యవహారంలో బాధ్యులపై వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాము. చెట్ల నరికివేత మీద చర్యలు మొదలుపెడితే వైసీపీలో ఉన్న చాలా మంది నాయకులు ఊచలు లెక్కపెట్టాల్సి ఉంటుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెట్ల నరికివేతపై మేము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పోలీస్ శాఖ స్పందించలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ, జేసీ భార్గవతేజ, నగర కమీషనర్ పులి శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి, ఉన్నతాధికారులు కజురియా, ఎస్.ఎస్. శ్రీధర్, రాహుల్ పాండే తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి పర్యటనలో అపశ్రుతి

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పర్యటనలో అపశ్రుతి చోటుచేసుకుంది. కాన్వాయ్‌లోని ఓ కారును రోడ్డుపై సిబ్బంది అడ్డంగా నిలిపారు. సరిగ్గా అదే సమయంలో వస్తున్న అంబులెన్స్ కారును చూసి ఆగింది. ఆ సమయంలో అంబులెన్స్‌లో ఉన్న రోగికి ప్రాణపాయ స్థితి ఏర్పడింది. దీంతో పోలీసుల సహకారంతో అంబులెన్స్ సిబ్బంది రోడ్డుపైనే ప్రథమ చికిత్స నిర్వహించారు.

క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి



రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన అనంతపురం జిల్లా బాలికల జట్టు

సత్తెనపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక శరభయ్య గుప్తా హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో కొనసాగిన అండర్-19 రాష్ట్ర స్థాయి బాలుర, బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో విజేతలకు ఆదివారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమంలో కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రీడల పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో సానుకూలంగా పని చేస్తున్నారన్నారు. క్రీడాకారులకు ఉద్యోగాల్లో ఉన్న రెండు శాతం రిజర్వేషన్‌ను మూడు శాతానికి పెంచి క్రీడాభివృద్ధికి దోహద పడుతున్నారన్నారు. సత్తెనపల్లిలో రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలను విజయవంతం చేసిన నిర్వాహకులను కన్నా అభినందించి సత్కరించారు.

విజేతలు వీరే..

రాష్ట్ర స్థాయిలో బాలుర విభాగంలో గుంటూరు జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని, విశాఖపట్నం జట్టు ద్వితీయ స్థానాన్ని, కర్నూలు జట్టు తృతీయ స్థానాన్ని, విజయనగరం జిల్లా జట్టు నాలుగో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. బాలికల విభాగంలో మొదటి స్థానాన్ని అనంతపురం జట్టు, రెండో స్థానాన్ని వైఎస్ఆర్ కడప జిల్లా, మూడో స్థానాన్ని గుంటూరు జిల్లా, నాలుగో స్థానాన్ని విశాఖపట్నం జిల్లా జట్టు కైవసం చేసుకున్నాయి. విజేతలకు ఎమ్మెల్యే కన్నా బహుమతులను అందించారు. టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, ఆళ్ల అమరేశ్వరరావు, కంబాల వెంకటేశ్వరరావు, దరువూరి నాగేశ్వరరావు, ప్రగతి విద్యా సంస్థల అధినేత మక్కెన అచ్చయ్య, ప్రిన్సిపల్ రాయపాటి శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నరసింహారావు, సహాయ కార్యదర్శి సీహెచ్ పద్మాకర్, నిర్వాహకులు పి.శివరామకృష్ణ, ఎస్ సుధాకర్‌రెడ్డి, లాకు పిచ్చయ్య, అనీల్ దత్తా నాయక్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపిక

సత్తెనపల్లి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద మక్కెన జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న తలపాల యామిని జాతీయ స్థాయిలో జరిగే అండర్ - 19 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు పీఈటీ అనిల్ దత్తా నాయక్ ఆదివారం తెలిపారు. శరభయ్య హైస్కూల్ క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్-19 ఫుట్‌బాల్ పోటీల్లో యామిని జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిందన్నారు. జిల్లా జట్టులో అత్యుత్తమ ప్రతిభ చూపటంతో జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు ఆయన చెప్పారు.

శ్రీకృష్ణ దేవరాయలు ప్రతి తరానికి స్ఫూర్తిదాయకమే

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



కోటప్పకొండలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ లావు , ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ దేవరాయలు పరిపాలన దక్షకుడే కాదు, సకల కళా వల్లభుడు, వారు ప్రతి తరానికి స్ఫూర్తిదాయకమేనని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. కోటప్పకొండలోని కాపు సత్రంలో శ్రీకృష్ణదేవరాయ ట్రస్ట్ 25వ రజిత వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణను ట్రస్ట్ సభ్యులు ఘనంగా ఆహ్వానించారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్నివారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవరాయలు దేవాలయాల అభివృద్ధిలో చూపించిన కళ ప్రపంచ స్థాయిలో నిలిచిందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రజా పరిపాలనలో రాజులకే రారాజు శ్రీకృష్ణదేవరాయలు అని అన్నారు. పల్నాడు జిల్లా కాపునాడు అధ్యక్షుడు పోతుల శంకర్, కె.రామకృష్ణ, రాయల శ్రీనివాసరావు, శ్రీశైలం కాపు అన్నదాన సత్రం చైర్మన్ ఎం.హనుమంతరావు, తోట సాంబశివరావు, కోవూరి బాబు, మీనా సందీప్, ఢిల్లీ నాయుడు, కాసా ఆంజనేయులు, శ్రీకృష్ణ దేవరాయ ట్రస్ట్ సభ్యులు, రంగిశెట్టి రామకృష్ణ, జనసేన నాయకులు, అల్లంశెట్టి మోహనరావు ఎత్తున పాల్గొన్నారు.

కారంచల్లి కత్తులతో హత్య



హత్యకు గురైన యువకుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పొన్నూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేటాడి వెంటాడి కారంచల్లి కత్తులతో పొడిచి హత్య చేసిన సంఘటన పొన్నూరు మండలం ములుకుదురు గ్రామంలో ఆదివారం జరిగింది. రూరల్ పోలీసులు, హతుడి బంధువులు కథనం ప్రకారం మండల పరిధిలోని మాచవరం గ్రామానికి చెందిన నక్కల దేవరాజ్ విద్యుత్ మీటర్ల రీడింగ్ తీస్తూ జీవనం సాగిస్తున్నాడు. దేవరాజు ఆదివారం ములుకుదురు గ్రామం పరిధిలో పంట పొలాల వద్ద హత్యకు గురైనట్లు బంధువులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హత్య జరిగిన తీరు చూసి స్థానికులు హడలిపోతున్నారు. దేవరాజును వేటాడి వెంటాడి కారం చల్లి కత్తులతో పొడిచి చంపినట్లు పోలీసులు గుర్తించారు. పథకం ప్రకారమే కాపుకాచి విచక్షణా రహితంగా రాడ్లుతో కొట్టి కత్తులతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. హత్య సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్సై గండు కిరణ్, సీఐ వై.కోటేశ్వరరావు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఈ హత్యకు కుల వివక్షతే కారణం అని మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణం అన్ని పోలీసులు అనుమానిస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ విడాకులు తీసుకున్న మహిళతో దేవరాజు వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో సదరు యువతి మరోవ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న నేపథ్యంలో ఇరువురి మధ్య వివాదం చలరేగి ఈ హత్యకు దారితీసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి..

దళితులపై జరుగుతున్న దాడులను తక్షణమే అరికట్టాలని, హతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆదివారం ములుకుదురులో దళిత సంఘాల నాయకులు ధర్నాకు దిగారు. దేవరాజు హత్య సమాచారం తెలుసుకున్న నాయకులు పెద్ద ఎత్తున ములుకుదురు గ్రామంలోని జీబీసీ రోడ్డుపైకి చేరుకుని రాస్తారోకో నిర్వహించారు.

నాటి ఘటనలు కలచివేశాయి

● హస్తకళల అభివృద్ధి చైర్మన్ మంజులారెడ్డి



రెంటచింతల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మే 13న పోలింగ్ రోజున రెంటాల గ్రామంలోని పోలింగ్ బూత్ నంబర్లు 239,240,241,242 వద్ద జరిగిన ఘటనలు కలచివేశాయని, ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న జూలకంటి బ్రహ్మనందరెడ్డి ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా వ్యవహరించిన తీరును జీవితాంతం గుర్తుంచుకుంటానని రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ చేర్రెడ్డి మంజులరెడ్డి ఉద్వేగంతో అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో తొలిసారి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉదయం 6 గంటల 20 నిమిషాలకు దాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్న బ్రహ్మనందరెడ్డి హుటాహుటిన తరలివచ్చి తొలుత రెంటచింతలకు అక్కడ నుంచి గురజాల ఆసుపత్రికి మమ్మలందర్నీ తరలించారన్నారు. నియోజకవర్గంలోని 74 గ్రామాల్లో జరుగుతున్న పోలింగ్‌ను పక్కనపెట్టి, మా వద్ద గంటల కొద్ది వేచి ఉండి ధైర్యాన్ని నూరిపోసి అప్పటికప్పుడు చంద్రబాబుకు పరిస్థితిని వివరించారన్నారు. అప్పటి అధికార పార్టీ నేతలకు పోలీసుల అండదండలు పుష్కలంగా ఉండడం వలన టీడీపీ నేతలు నిస్సాహాయులుగా ఉండిపోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం వలన దెబ్బలు తిన్న వారందరూ బాధితులుగానే మిగిలిపోయామని, వైసీపీ అధికారంలోకి వచ్చినట్లయితే మా అందర్నీ ముద్దాయిలుగా పెట్టి కటకటాల పాలు చేసేవారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ గెలుపే ధ్యేయంగా భావించిన బ్రహ్మనందరెడ్డి పార్టీ శ్రేణులను సైనికులుగా పేర్కొని ఎన్నికల కదనరంగంలోకి దిగి విజయతీరాలకు చేరుకున్నారని పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి, శ్రీనివాసరావు, టౌన్ అధ్యక్షుడు రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీలు శివయ్య, రాజ్‌కుమార్, వెన్నా కృష్ణారెడ్డి, శౌర్రెడ్డి, బోడపాటి రామకృష్ణ, నాళం పెదబాబు, రెంటాల అంజి, సన్నెగంటి సిద్ధయ్య, లింగా పున్నారావు, పోట్ల సతీష్, ఎం.శ్రీను,పాలువాయిగేట్ నరేంద్ర, అల్లం బ్రహ్మరెడ్డి తదితరులున్నారు.

దాతలు సహకరిస్తే.. ఊపిరి నిలుస్తుంది



సర్వేంటిలేటర్‌పై ఉన్న చేజర్ల శంకర్

నరసరావుపేట టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతురులో నివాసం ఉంటున్న చేజర్ల శంకర్ మైలాటిస్ అనే వ్యాధితో బాధ పడుతూ 18 ఏళ్లుగా మంచానికే పరిమితమై బతుకు పోరాటం చేస్తున్నారు. ఆయన జీవించి ఉండాలంటే సర్వేంటిలేటర్ అవసరం. ఆ యంత్రం ఆడితేనే అతని శ్వాస ఆడతుంది. దాతలు ఇచ్చిన సర్వేంటిలేటర్‌తో ఆయన భార్య కవిత సేవలతో ఇప్పటి వరకు జీవనం సాగించారు. అయితే సర్వేంటిలేటర్ నిర్వహణ వారికి తలకుమించిన భారం అయింది. ఆ యంత్రంలోని ట్రైకాస్టమి ట్యూబ్, కేతట్రామౌంట్, బాక్టిరియల్ వైరల్ ఫిల్టర్, సక్షన్ ట్యూబ్, వెంటిలేటర్ ట్యూబ్, యూరిన్ కేతట్రా, గ్లౌజ్ బాక్స్ తదితర వస్తువుల నిర్వహణకు నెలకు రూ.11 వేలు ఖర్చు అవుతుందని శంకర్ తెలిపారు. దీనికితోడు ప్రభుత్వం టిడ్కో గృహాల్లో కేటాయించిన ఇంటికి లోను కట్టాలని బ్యాంక్ మేనేజర్ ఫోను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 18లోపు కట్టకపోతే బ్లాక్ లిస్ట్‌లో పెడతామని చెప్పారన్నారు. ప్రభుత్వం పింఛన్‌గా రూ.10 వేలు ఇస్తుందని తెలిపారు. గతంలో ఆర్ఎంపీగా పనిచేసి జీవనం సాగించిన చేజర్ల శంకర్ కుటుంబానికి ఎలాంటి ఆదాయం లేకపోవడం ఇబ్బందిగా పరిణమించింది. పూర్తిగా మంచంపై ఉన్నవారికి రూ.15 వేలు ఇస్తామని చెప్పారని, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదుకుంటారని ఆశతో ఎదురు చూస్తున్నానని అన్నారు. తన భార్య కవితకు మోకాలి శస్త్రచికిత్స జరిగిందని, ఆమె కూడా ఏ పని చేయలేదని వివరించారు. దాతలు సహకరించాలని కోరారు. సహాయం చేయాలనుకున్న దాతలు 7981262549 నంబరును సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

హోరాహోరీగా బేస్‌బాల్ పోటీలు



బేస్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ప్రత్తిపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీలు రెండో రోజు ముగిశాయి. బాలురు, బాలిక విభాగాల్లో ఆదివారం జరిగిన పోటీలను అబ్జర్వర్ శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగాధరరావు ఫలితాలను వివరించారు. బాలుర విభాగంలో.. గుంటూరు, విజయనగరం జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో విజయనగరం జట్టు 05-06 పాయింట్ల తేడాతో గెలుపొందింది. కృష్ణా, ప్రకాశం జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు 06-01 పాయింట్ల తేడాతో, కర్నూలు, విశాఖపట్నం జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో కర్నూలు జట్టు 04-02 పాయింట్లతో, కడప, శ్రీకాకుళం జిల్లాల మధ్య జరిగిన పోటీలో శ్రీకాకుళం 05-04 పాయింట్లతో గెలుపొందాయి. బాలికల విభాగంలో.. ప్రకాశం, అనంతపురం జిల్లాల మధ్య జరిగిన పోటీలో ప్రకాశం 10-00 పాయింట్లతో గెలుపొందింది. కడప, గుంటూరు జిల్లాల మధ్య జరిగిన పోటీలో గుంటూరు జట్టు 0-5 పాయింట్లతో, శ్రీకాకుళం, చిత్తూరు జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో శ్రీకాకుళం జట్టు 06-00 పాయింట్లతో, కర్నూలు, విజయనగరం జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో కర్నూలు జట్టు 03-01 పాయింట్లతో గెలుపొందింది. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు, పాఠశాల కమిటీ చైర్మన్ చౌదరి బాబు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సుబ్రమణ్యం, మస్తాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● 38 మంది జూదరుల అరెస్టు ● రూ. 93,600 నగదు స్వాధీనం

ప్రత్తిపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న భారీ పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం మెరుపుదాడి చేశారు. చినకోండ్రుపాడు సమీపంలో జాతీయ రహదారి పక్కన కిట్స్ కళాశాలకు వెళ్లే దారిలో ఒక రేకుల షెడ్డుతో పాటు చుట్టూ ప్రహరీ ఉన్న బహిరంగ ప్రదేశంలో కొంతకాలంగా పేకాట స్థావరం నడుస్తుంది. ఇక్కడికి ప్రత్తిపాడుతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పేకాట రాయుళ్లు వచ్చి లక్షల్లో పందేలు కాస్తూ కోతముక్క ఆడుతున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు ప్రత్తిపాడు సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర, సిబ్బంది ఈ దాడులు నిర్వహించారు. సుమారు యాభై మంది వరకు పేకాట ఆడుతున్నట్లు తెలిసింది. పోలీసులు దాడులు చేసిన సమయంలో కొంతమంది పారి పోయారు. ఈ దాడుల్లో వారి వద్ద ఉన్న రూ. 93,600 నగదును స్వాధీనం చేసుకుని 38 మందిని అరెస్టు చేశారు.

క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలి



బాలికల క్రీడాకారుల జట్లతో వేగేశన రాధాకృష్ణరాజు

పిట్టలవానిపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు మరింత శిక్షణ ఇవ్వాలని పిట్టలవానిపాలెం మండల కేర్ విద్యా సంస్థల అధినేత వేగేశన రాధాకృష్ణరాజు అన్నారు. ఆదివారం పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆంధ్రప్రదేశ్ పాఠశాలల విద్యాశాఖ సౌజన్యంతో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాల, బాలికల కబడ్డీ పోటీలు 2024-2025 సంవత్సరానికి సంబంధించి బాపట్ల జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి షేక్.కరీముల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలకు ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. తొలుత క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. 13 జిల్లాలకు చెందిన కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు. స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.ప్రశాంత్ బాబు పర్యవేక్షించారు. వేగేశన కిషోర్‌రాజు, మాజీ ఎంపీపీ కంకిపాటి యశోద నరసింహమూర్తిరాజు, ఆయా జిల్లాలకు చెందిన కోచ్‌లు, క్రీడాభిమానులు, పాఠశాల హెచ్ఎమ్ షేక్.మహబూబ్ సుభాని పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123, 132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎగువ నుంచి 785 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 10 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్

నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 587.20 అడుగులు ఉంది. ఇది 305.62 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3608 క్యూసెక్కులు, ఎస్ఎల్బీసీ ద్వారా 1800, ఎల్ఎల్సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 15,928 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 15,928 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

12న జాబ్ మేళా

సత్తెనపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12న సత్తెనపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాలజీరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్తెనపల్లి నియోజక వర్గంలోని యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. 10వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, డిప్లమో చదివినవారు జాబ్ మేళాకు హాజరై ఉద్యోగాలు పొందవచ్చన్నారు.

ఉచిత శిక్షణ ప్రారంభం

మాచర్లటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో గల స్వామి వివేకానంద సేవాశ్రమంలో ఆదివారం శ్రీరామ కృష్ణ సేవా సమితి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కంప్యూటర్ ఉచిత శిక్షణా తరగతులను సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని, అందుకే కంప్యూటర్ బేసిక్స్‌ను వారికి ఉచితంగా నేర్పేందుకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాగసురేష్ కుమార్, సేవా సమితి సభ్యులు పాపిరెడ్డి, షేక్ చినలాలుసాహెబ్, ఉపాధ్యాయుడు గంధ్రకోట ప్రసాద్, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం

దుర్గి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముటుకూరులో ఆదివారం నరసరావుపేటకు చెందిన అమూల్య నర్సింగ్‌హోం ఆధ్వర్యాన నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కుమారుడు డాక్టర్ చదలవాడ ఆదిత్య నేతృత్వంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కుమారుడుగౌతమ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య నేత అమర్ మృతి

దాచేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండల ఆర్యవైశ్య నేత వల్లంబొట్ల అమర్ ఆదివారం నారాయణపురంలోని నివాసగృహంలో వైద్యసేవలు పొందుతూ మృతి చెందారు. మృతుడు వల్లంబొట్ల అమర్ (54) పిడుగురాళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులుగా, ఉమ్మడి గుంటూరు జిల్లా ఆర్యవైశ్య నాయకులుగా పనిచేశారు. అదేవిధంగా మట్టపల్లి, గుత్తికొండబిళం ఆర్యవైశ్య సత్రాలలో కీలకనాయకుడిగా వ్యవహరించారు. మృతునికి భార్య, కుమార్తె వున్నారు. టీడీపీ, జనసేన, ఆర్యవైశ్య ప్రముఖులు పలువురు అమర్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రైతులతో విద్యార్థుల మమేకం

ముప్పాళ్ళ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : 'గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ' కార్యక్రమంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు మాదల గ్రామంలో రైతులతో కలసి పనుల్లో మమేకమయ్యారు. వ్యవసాయంకు సంబంధించి వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏ నరేష్, గ్రామ రైతులు కామేపల్లి గోపీకృష్ణ, గోగుల వెంకయ్య, దత్తు బాబు, గాలయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై

గ్రామ సభలు

నకరికల్లు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లు మండలంలోని గుండ్లపల్లి, నకరికల్లు, చల్లగుండ్ల గ్రామాల్లో ఆదివారం సామాజిక తనిఖీ బృందాలు గ్రామ సభలు నిర్వహించారు. పెద్దగా ప్రచారం లేకపోవటంతో గ్రామ సభలకు ప్రజలు అంతంత మాత్రంగానే హాజరయ్యారు. గుండ్లపల్లిలో రూ 1,25,77,018 నిధులను ఖర్చు చేసినట్టు తెలిపారు. నకరికల్లులో రూ 1,02,68,969 లను గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనుల కింద ఖర్చు చేశారు. చల్లగుండ్లలో రూ 56,07,277 ఉపాధి నిధులను వినియోగించినట్టు అధికారులు గ్రామ సభల్లో వెల్లడించారు. గ్రామ సభల్లో వేరే ప్రాంతంలో నివాసం ఉండే వారికి, వ్యాపారాలు నిర్వహించే వారికి ఉపాధి పనులు చేసినట్టు ఫిర్యాదులు అందాయి.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

పిడుగురాళ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూలకల్లు గ్రామానికి చెందిన చల్లా మణిమ్మకు, ఆదే గ్రామానికి చెందిన రెడ్డి లక్ష్మారెడ్డికి పాత కక్షల నేపథ్యంలో ఆదివారం ఏర్పడిన ఓ వివాదం ఘర్షణకు దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముందుగా పొలం వద్ద లక్ష్మారెడ్డికి, మణిమ్మకు ఏర్పడిన వివాదంలో మణిమ్మను లక్ష్మారెడ్డి అసభ్య పదజాలంతో దూషించాడు. ఆ తర్వాత మణిమ్మ గ్రామంలోకి వెళ్లి తన కుమారుడైన రాజేష్‌కు, బంధువులైన వీరయ్యలకు విషయం చెప్పగా వారు లక్ష్మారెడ్డిపై దాడికి పాల్పడ్డారు. గాయాపాలైన లక్ష్మారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకట్రావు తెలిపారు.

మాచర్ల రైల్వే స్టేషన్‌కు

మహర్దశ

- రూ. 9 కోట్ల నిధులు మంజూరు
- శరవేగంగా జరుగుతున్న పనులు



మాచర్ల రైల్వే స్టేషన్


ఫ్లాట్ ఫారం ఆధునీకీకరణ పనులు

మాచర్ల రైల్వే స్టేషన్ అనగానే ప్రజల్లో పెదవి విరుపు.. సంవత్సరాల తరబడి అభివృద్ధికి నోచుకోక ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉండేది.. కొద్దిపాటి షెడ్డు, సరైన పార్కింగ్, లైటింగ్, ఫ్లాట్‌ఫాం సదుపాయం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.. నిన్నా మొన్నటి వరకు సరైన వసతులు లేక కునారిల్లుతున్న ఈ రైల్వే స్టేషన్‌కు నేడు మహర్దశ పట్టింది. అమృత్ భారత్ స్కీంలో భాగంగా ఈ రైల్వేస్టేషన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నారు.. దీంతో ప్రయాణికులకు అన్ని వసతులు సమకూరనున్నాయి.

మాచర్లటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ స్కీంలో భాగంగా మాచర్ల పట్టణంలోని రైల్వే స్టేషన్‌కు కేంద్ర ప్రభుత్వం రూ. 9 కోట్ల నిధులను మంజూరు చేసింది. నిధులు విడుదలై రెండేళ్ల గడిచింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు ఊపందుకున్నాయి. ప్రత్యేక టిక్కెట్ కౌంటర్, ఫ్లాట్‌ఫారం ఆధునికీకరణ, వాహనాలకు పార్కింగ్, సెంట్రల్ లైటింగ్, భవన నిర్మాణాలు, ప్రయాణికులకోసం షెడ్డు పొడిగింపు, వాటర్ ట్యాంకు ఏర్పాటు తదితర అభివృద్ధిపనులు శరవేగంగా జరుగుతున్నాయి. పనులన్నీ పూర్తయితే మాచర్ల రైల్వేస్టేషన్ సర్వాంగ సుందరంగా మారనుంది.




సిద్ధమవుతున్న పార్కింగ్, సెంట్రల్ లైటింగ్ పనులు

గతిశయోక్తి స్కీంలో భాగంగా..

డీఆర్ఎం ఎం.రామకృష్ణ గతంలో మాచర్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ రైల్వే స్టేషన్లను సందర్శించి, అభివృద్ధి చేయాల్సిన పనులు గురించి పరిశీలించి రైల్వే శాఖకు నివేదికలు పంపారు. ఇందులో భాగంగా ఆయా స్టేషన్లలో పార్కింగ్, వాటర్ ట్యాంకు, సెంట్రల్ లైటింగ్, ఫ్లాట్‌ఫారం ఆధునీకరణ, షెడ్డు, కార్యాలయాలు ఆధునీకరించనున్నారు. ఈ మేరకు మాచర్ల రైల్వే స్టేషన్‌కు నిధులు మంజూరయ్యాయి.

అదనపు బోగీలు కోరుతున్న ప్రయాణికులు..

మాచర్ల పట్టణం పల్నాడు జిల్లాకు చివరనున్న నియోజకవర్గం కావడంతో మాచర్ల సమీపంలోని, సుదూరంలోని మండలాలు, గ్రామాల నుంచి ప్రజలు ఈ రైల్వే స్టేషన్‌కు చేరుకొని ప్రయాణాలు సాగిస్తుంటారు. అయితే ప్రయాణికులకు సరిపడా బోగీలు లేకపోవడం వలన ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోంది. ప్రస్తుతం ఉన్న ప్యాసింజర్ రైలుకు అదనపు బోగీలు పెంచడంతో పాటు ఎక్స్‌ప్రెస్ రైలును ఏర్పాటు చేయాలని నియోజక వర్గ ప్రజలు, ప్రయాణికులు రైల్వేశాఖ ఉన్నతాధికారులను, నేతలను కోరుతున్నారు.

ఆర్అండ్ఆర్ సెంటరు అభివృద్ధికి కృషి

- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలం న్యూచిట్యాల ఆర్అండ్‌బీ సెంటర్‌ను అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం బెల్లకొండ మండలం న్యూచిట్యాల ఆర్అండ్ఆర్ సెంటరు టీడీపీ నేతలు, మాజీ సర్పంచ్ హనుమంతరావునాయక్, పలువురు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను గుంటూరులోని ఆయన కార్యాలయంలో కలిశారు. న్యూ చిట్యాల ఆర్అండ్ఆర్ సెంటరు ఏర్పడి పదేళ్లు కావస్తున్నా ఇంతవరకు శ్మశాన స్థలం లేదని, ఎన్నిసార్లు అధికారులచుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని, తమరైనా శ్మశాన స్థలం కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే స్పందిస్తూ శ్మశాన స్థలం కేటాయింపునకు తన వంతు కృషిచేస్తానని హామి ఇచ్చారు. అదేవిధంగా డ్రెయినేజ్ వ్యవస్థను మెరుగు పరచాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నరసింహానాయక్, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు నాగమణిబాయి, టీడీపీ నాయకులు వెంకటరావు, బెల్లంకొండ టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ

బెల్లంకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపాయపాలెం గ్రామంలో రెండు ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. యాదవ బజారులో శ్రీ కృష్ణ దేవాలయం, ప్రధాన సెంటరులో సీతారాముల ఆలయంలో నిర్వహించిన విగ్రహాలప్రతిష్ఠ కార్యక్రమానికి భక్తులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగవాతావరణం నెలకొంది. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బెల్లంకొండ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు.


మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా, ఆర్యవైశ్య సంఘం నేతలు

ఆర్యవైశ్య కార్తీక వన సమారాధనలో

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ముప్పాళ్ళ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చాగంటివారిపాలెం గ్రామం, సాయిబాబా ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్య కార్తీకవన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నేతలతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయం ముందు ఏర్పాటుచేసిన మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు ఎమ్మెల్యే కన్నా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పలువురు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలతో సామాజిక ఐక్యత

- శాలివాహన సంఘం వనసమారాధనలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక వన భోజనాల కార్యక్రమం ఆయా సామాజికవర్గంలోని ప్రజల మధ్యను ఐక్యతను బలోపేతం చేస్తుందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం దేవరంపాడు నేతివెంకన్నస్వామి దేవాలయం వద్ద పిడుగురాళ్ల వెంకటేశ్వర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనసమారాధన కార్యక్రమంలో గురజాలఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో శాలివాహన సంఘానికి తగు ప్రాధాన్యం ఇచ్చిందని, 2014-19 మధ్యకాలంలో కమ్యూనిటీహాలు నిర్మాణానికి 20 సెంట్లు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. గత ఐదేళ్లలో ఆ స్థలాన్ని అన్యాక్రాంతం చేశారన్నారు. కొద్ది రోజుల్లో ఆ 20 సెంట్ల స్థలాన్ని కేటాయించడంతో పాటు ప్రభుత్వ పరంగా రూ.10లక్షల నిధులు మంజూరయ్యేలా చూస్తానని, కవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని పిడుగురాళ్లలో ప్రతిష్ఠించేలా చూస్తానన్నారు. ముందుగా ఎమ్మెల్యేని కమిటీ సభ్యులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బాడిశ రవికుమార్, పాండురంగ శ్రీను, నడికూడి వెంకటేశ్వరరావు, జమ్మిశెట్టి రామకృష్ణ, బాడిశ మస్తాన్, చీరాల వెంకటేశ్వర్లు, మద్దిగుంట్ల కోటేశ్వరరావు, గురవయ్య, వడ్డవల్లి సర్వేశ్వరరావు, సాంబ శివరావు, పిల్లి చెన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతికి సంతాపం

క్రోసూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రోసూరులో టీడీపీ నేత మేకా వెంకటేశ్వర్లు ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఫోన్ ద్వారా వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించారు.మార్కెట్‌యార్డు మాజీచైర్మన్ కాంధ్రు కాశయ్య పార్టీ నేతలు దుద్దుల యోహాన్, మన్నెం శివయ్య, మల్లాల రామాంజనేయులు, కాగితాల వెంకటేశ్వర్లు తదితరులు వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సాగరమాత ఆలయంలో

ప్రత్యేక ప్రార్థనలు

మాచర్లరూరల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లోగల సాగరమాత ఆలయంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ భక్తులకు దైవ సందేశం అందించారు. అనంతరం తేరు ప్రదిక్షణ జరిపారు. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

భగవద్గీతపై ప్రచారం

మాచవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోర్జంపాడు గ్రామంలో ఆదివారం ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్ల వారి త్రైత సిద్దాంత ప్రబోధ సేవాసమితి పిడుగురాళ్ళ, చిలకలూరిపేట కమిటీ సభ్యులు గ్రామంలో భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు.కార్యక్రమంలో కమిటీ సభ్యులు కటకం సైదారావు, వీరాంజనేయులు, అరుణ, కార్తీక్, నారాయణమ్మ, గోపీ, అనురాధ పాల్గొన్నారు.

రెండో రోజూ జీరో అర్జీ

మాచవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నూతన ఓటర నమోదు కోసం రెండవ రోజు ఆదివారం కూడా ఒక్క అర్జీ రాలేదని తహసీల్దార్ క్షమారాణి తెలిపారు. విద్యార్థులు కళాశాలల్లో ఉండటం కారణంగానే ఓటరు నమోదు అర్జీలు రాలేదని తాము భావిస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

శాశ్వత సభ్యత్వాలను పెంచాలి

- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో టీడీపీ శాశ్వత సభ్యత్వాలను పెంచాలని, కనీసం 200 మంది శాశ్వత సభ్యత్వం తీసుకునేలా నేతలు కృషిచేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం ఆయన గుంటూరులోని తన గృహంలో పెదకూరపాడు నియోజకవర్గ ముఖ్య నేతల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదుపై నేతలందరూ ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామంలోని సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని, డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. నియోజకవర్గంలో ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా బాధ్యతాయుతంగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సమావేశంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.


టీడీపీ మహిళా కార్యకర్తలకు సభ్యత్వ నమోదు చేస్తున్న కన్నా నాగరాజు

టీడీపీ సభ్యత్వ నమోదు

సత్తెనపల్లిరూరల్,నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాకాలపాడు గ్రామంలో ఆదివారం టీడీపీ ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుంటూరునగర మాజీమేయర్ కన్నా నాగరాజు మాట్లాడుతూ టీడీపీ కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరు సభ్యత్వం తీసుకోవాలని, గతంలో సభ్యత్వం కలిగిన వారు దాన్ని రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. సభ్యత్వం తీసుకోవటం ద్వారా కలిగే ప్రయోజనాలను కార్యకర్తలకు వివరించారు. 90 మందికి పార్టీ సభ్యత్వాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కొనికినేని సత్యనారాయణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు షేక్ నన్నే సాహెబ్, నేతలు కొఠారు అంజయ్య, బక్కా వెంకయ్య, సింకా కప్పరాజు, చెన్నయ్య, వీరయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సర్ చార్జీలను ఉపసంహరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేత హుస్సేన్

దాచేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ సర్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దాచేపల్లిలోని ఎస్టీయూ భవన్‌లో సీపీఐ గురజాల నియోజకవర్గం కమిటీ నేతల సమావేశాన్ని ఏకృష్ణనాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు హామి ఇచ్చిన చంద్రబాబు, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ప్రజలపై సర్‌చార్జీల భారాన్నిమోపటం సరైంది కాదన్నారు. ట్రూఅప్‌చార్జీల పేరుతో సుమారు రూ.6,072 కోట్ల ప్రజలపై భారం మోపారన్నారు. ఇవేకాక రూ.11 వేల కోట్లు విద్యుత్ భారాలను ప్రజలపై మోపడానికి ప్రభుత్వం సిద్ధంగా వుందన్నారు. డిసెంబరు 26న కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం జరిగి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని, ఈసందర్భంగా వాడవాడలా ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో సీపీఐ నేతలు పలువురు పాల్గొన్నారు.

కష్టపడిన వారికి గుర్తింపు

ముప్పాళ్ళ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడ్డ వారికి గుర్తింపు ఉంటుందని టీడీపీ మండల నేత మధిర రామ్మోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ శ్రేణుల అరాచకాలను తట్టుకొని నిలబడిన టీడీపీ కార్యకర్తలను పార్టీ గుర్తించిందన్నారు. రెండవ విడత నామినేటెడ్ పదవుల్లోనూ సీఎం చంద్రబాబు నిజమైన కార్యకర్తలను గుర్తించి పదవులను ఇవ్వటం సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ లిమిటెడ్ ఛైర్మన్‌గా నియమితులైన జీవీ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే

కఠిన చర్యలు తీసుకుంటాం

- నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్

ఫటా ఫట్


చల్లా సురేష్, నకరికల్లు ఎస్ఐ

నకరికల్లు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతలకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని, గ్రామాల్లో పరిస్థితుల పై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పల్నాడే వారి పై నిఘాను ఏర్పాటు చేశామని నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు. ఆయన ఆంధ్రజ్యోతి ప్రతినిధి 'ఫటాఫట్.'

ప్ర : రోడ్డు ప్రమాదాల నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ : ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు వాహనాల తనిఖీని నిర్వహిస్తున్నాం. హెల్మెట్ ధరించని వారి పైన, నిబంధనలు పాటించని వారి పైన అపరాధ రుసుం వసూలు చేస్తున్నాం. రాత్రి 8:30 గంటల సమయంలో డ్రంక్ డ్రైవ్‌లో భాగంగా తాగి వాహనాలు నడిపే వారి పై కేసులు నమోదు చేస్తున్నాం. మండలంలో ప్రమాద స్థలాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశాం.

ప్ర : జూదం, బెట్టింగ్‌లను ఎలా కట్టడి చేస్తున్నారు?

ఎస్ఐ : నిషేధిత లాటరీలను నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాం. ఇప్పటికే అలాంటి వ్యక్తులను గుర్తించి వారిలో కొంత మందిని అరెస్టు చేశాం. గ్రామాల్లో పేకాట ఆడే వారి పైన, బెట్టింగ్‌లు నిర్వహించే వారి పైన ఆయా గ్రామాల దత్తత పోలీసు అధికారులతో నిరంతరంగా పర్యవేక్షణ చేయిస్తున్నాం.

ప్ర : నాటు సారా, గంజాయి నివారణకు ఏం చేస్తున్నారు?

ఎస్ఐ : నాటు సారా స్థావరాలను గుర్తించాం. నాటు సారా కాచినా, అమ్మినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. గతంలో గంజాయి కేసు ఒకటి నమోదైందని, గంజాయి ఎక్కడి నుంచి రవాణా జరుగుతుందో తెలుసుకుంటున్నామన్నారు. నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతాం.

ప్ర : మహిళలపై దౌర్జన్యాలు, హింసాత్మక ఘనలపై చర్యలేమిటి?

ఎస్ఐ : పాఠశాలల్లో, కళాశాలల్లో బాలికలు, మహిళల పై జరిగే ఘటనల గురించి అవగాహన కల్పిస్తున్నాం. వారం వారం మహిళా పోలీసులతో పోలీసు స్టేషన్‌లో సమావేశాలు నిర్వహించి మహిళలపై జరుగుతున్న సంఘటనలకు సంబంధించి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం.

ప్ర : చోరీల నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ : గ్రామాల్లో ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమేరాలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లోను దొంగతనాలు నివారించేందుకు స్థానికుల సహకారాన్ని తీసుకుంటాం.


హస్తకళల అభివృద్ధి చైర్మన్ మంజులారెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ కూటమి నేతలు

టీడీపీ బలోపేతానికి కృషిచేస్తా

- ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి రుణపడి ఉంటా..
- రాష్ట్ర హస్తకళల అభివృద్ధి చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి

రెంటచింతల,నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'గ్రామ గ్రామాన టీడీపీని బలోపేతం చేయడానికి కృషిచేస్తా.. సీఎం చంద్రబాబు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ నిర్దేశించిన ప్రకారం వ్యవహరిస్తా.. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి తోడునీడలా వెన్నంటే వుంటా.. కష్టపడ్డోళ్లను అందలమెక్కిస్తారనే దానికి నేనే ఉదాహరణ' అని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన రెంటచింతలలోని పార్టీ కార్యాలయంలో కూటమి నేతల మంజులారెడ్డిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటరులో సీఎం చంద్రబాబు, డీ వైసీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీలు శివయ్య,రాజ్‌కుమార్, నాళం పెదబాబు, రెంటాల అంజి, బోడపాటి రామకృష్ణ, ఎం.శౌర్రెడ్డి, వెన్నా కృష్ణారెడ్డి, పోట్ల సతీష్, లింగా పున్నారావు, నరేంద్ర, అల్లం బ్రహ్మారెడ్డి, ఎం.సిద్దయ్య, ఎం.శ్రీను, మాజీ సర్పంచ్ సుంకయ్య, జనసేన నేతలు కోటేశ్వరరావు ,ఎం.రాధ తదితరులు పాల్గొన్నారు.

సత్రశాలలో ప్రత్యేక పూజలు : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వార్ల ఆలయంలో చేర్రెడ్డి మంజులారెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆమెతో ఎండోమెంట్ ఈవో రామిరెడ్డి, శివయ్య, పూజారి శర్మ, టీడీపీ నేతలు ఉన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మాలపాటి శ్రీధర్

ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం..

- పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్

అచ్చంపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ తెలిపారు. ఆదివారం అచ్చంపేటలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నక్యాంటీన్‌లు, ఇసుకపాలసీ, ఉచితగ్యాస్, మెగా డీఎస్సీకి శ్రీకారం వంటి హామీలను నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. అమరావతి నిర్మాణానికి శ్రీకారం చుట్టి పోలవరం ప్రాజెక్టును గాడిలో పెడుతుందని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని ఆర్థికంగా పరిపుష్టం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. నూతన బడ్జెట్‌లో సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ విధానంగా ఉండబోతోందని తెలిపారు. వైసీపీ సోషల్ మీడియాలో అవాకులు, చెవాకులు పేలేవారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. పల్నాడు జిల్లాలో 27శాతం కొత్త టీడీపీ సభ్యత్వాలు వస్తున్నాయని, అనేక మంది ఆన్‌లైన్‌లలో సభ్యత్వాలు పొందుతున్నారని తెలిపారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, నేతలు వెనిగండ్ల కోటయ్య, సందెపోగు వెంకయ్య, ఎస్‌కే కాసుల, సామేలు, పాపిరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

.. దరఖాస్తులు చేసుకోండి

క్రోసూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ క్రోసూరు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ వాయిస్ కోర్సు కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్సు కాల వ్యవధి రెండు నెలలు ఉంటుందని, 10వ తరగతి పైన చదువుకున్న పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని 15 నుంచి 45 సంవత్సరాల లోపు యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 14లోపు దరఖాస్తులు క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అందజేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల విద్యార్హత ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రెండు పాసుపోర్టు సైజు ఫోటోలతో నేరుగా దరఖాస్తులు అందజేయవచ్చని, రెండు నెలల శిక్షణ అనంతరం ప్రతిభ ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలియజేశారు. పూర్తి వివరాలకు 9494986164 నెంబరులో సంప్రదించ వచ్చని సూచించారు.

ఏపీఆర్‌డీసీ ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

మాచర్ల రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్ కృష్ణాఘాట్ వద్ద గ్రామంలోని ఏపీఆర్‌డీసీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆదివారం శ్రమదానం నిర్వహించారు. ఘాట్ వద్ద ముళ్ల కంపలు, చెత్తాచెదారం తొలగించి శుభ్రపరిచారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులను కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్‌కే మహ్మద్ బాషా, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

రుచీ.. శుచీ నేర్పుతారు

ఆహార పదార్థాలను రుచిగా శుచిగా ఎలా వండాలి. అంతే కాదు పదార్థాలల్లోని విలువలు పోకుండా ఎలా వండాలి. అంతేనా వాటిని మార్కెటింగ్ ఎలా చేయాలి.. ఆదాయ వనరుగా ఎలా మలచుకోవాలి.. వంటి అంశాలను నేటి తరానికి నేర్పిస్తూ వారిని తీర్చిదిద్దుతోంది బాపట్లలోని డాక్టర్ ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ. యువతను వ్యాపార వేత్తలుగా తీర్చి దిద్దే దిశగా పక్కా ప్రణాళికతో ముందుకెళుతోంది. అతి తక్కువ పెట్టుబడితో రుచికరమైన ఆహార పదార్థాలను శుచిగా జనాలకు అందించడం ఎలాగో నేర్పుతుంది. ఈ రోజుల్లో జనాలు ఆరోగ్యానికి ఇస్తున్న ప్రాధాన్యం తెలియని కాదు. అందుకే ఇక్కడ ఆరోగ్య కరమైన ఆహారాన్ని తయారు చేసే విధానంలో కూడా ఈ కళాశాల తర్ఫీదునిస్తోంది. అలాంటి వినూత్నమైన కళాశాల ద్వారా వెలుగులోకి వస్తున్న అభినవ నలభీములపై ఓ లుక్కేద్దామా...

కళాశాల అంతా ఘుమఘుమలే....

నాలుగో సంవత్సరం చదువుచున్న ఫుడ్ సైన్సు విద్యార్థులు రకరకాల వంటకాల తయారీలో ఉండడంతో కళాశాల మొత్తం ఆ వాసనలతో ఘుమఘుమలాడుతూ ఉంటోంది. తరగతి గదులన్నీ వంటిల్లులాగా మారిపోవడం, విద్యార్థులు గుంపులుగా ఏర్పడి గరిట తిప్పుతున్న దృశ్యాలు ఆ కళాశాలలో సర్వ సాధారణం. మొత్తం 250 మంది విద్యార్థులకు గాను అమ్మాయిలు 200 వరకు ఉండగా, అబ్బాయిల సంఖ్య 50 వరకు ఉంటుంది

రుచి, శుచి, ఆరోగ్యం....

ఫుడ్ సైన్స్ టెక్నాలజీలో విద్యార్థులకు బోధించేటప్పుడే రుచి, శుచి, ఆరోగ్యంతో పాటు నాణ్యతకు పెద్ద పీట వేసే విధంగా అక్కడ బోధన ఉంటుంది. మొత్తం 6 యూనిట్లుగా విభజించి బోధన జరుగుతుంది. సిరెల్స్, ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్, స్పైసెస్, మీట్, మిల్క్, మిల్లెట్ యూనిట్లుగా వంటల తయారీ ఉంటుంది. ఒక్కో యూనిట్‌కు పదిమంది విద్యార్థులను కేటాయించి వివిధ రకాల ఆహార తయారీలను నేర్పుతారు



తినుబండారాలలో ఉన్న పోషక విలువలను వినియోగదారులకు వివరిస్తున్న విద్యార్థులు

- వినూత్న వంటకాల తయారీలో ఫుడ్ సైన్స్ కళాశాల
- మార్కెటింగ్ మెలకువల్లోనూ శిక్షణ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ పరిధిలో నడుస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ బాపట్లలో 2003లో ప్రారంభమైంది. ఇది ఫుడ్‌సైన్స్‌లో బీటెక్ కోర్సును నాలుగు సంవత్సరాలకు అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాలనుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడకు ఫుడ్ సైన్స్ కోర్సు అభ్యసించడానికి వస్తారు. మొదటి మూడు సంవత్సరాలు థియరీ తరగతులకు పరిమితమయ్యే బోధన చివరి సంవత్సరంలో మాత్రం ప్రాక్టికల్‌గా వంటలు చేయడం, అమ్మడం వంటి వాటితో గ్రాడ్యుయేషన్ కోర్సును విద్యార్థులు పూర్తి చేస్తారు

ఒక్కో యూనిట్‌కు 25,000 కేటాయించి..

గ్రూపులుగా విద్యార్థులను విభజించిన తర్వాత వారికి యూనిట్లను కేటాయిస్తారు. ఒక్కో గ్రూపుకు పెట్టుబడి కింద 25,000 అందించి నాలుగు నెలల వ్యవధి ఇస్తారు. ఆ మొత్తంతో ముడిసరుకును తెచ్చుకోవడం, ఆహార పదార్థాలు తయారు చేయడం, ప్యాకింగ్, అమ్మకం ఈ ప్రక్రియ అంతా కూడా నాణ్యతా ప్రమాణాలకు లోబడి జరగాల్సి ఉంటుంది. చివరి అంకం అమ్మకాలు కూడా విద్యార్థులే చేయాల్సి ఉంటుంది. పెట్టుబడి కింద ఇచ్చిన 25,000ను పెంచి చూపెట్టి మార్కెటింగ్ నైపుణ్యాన్ని కూడా విద్యార్థులు ఈ ప్రాక్టికల్ శిక్షణలో చూపెట్టాల్సి ఉంటుంది

ఆర్గానిక్ ముడిసరుకు....


విద్యార్థులు తమ ఉత్పత్తులకు కావాల్సిన ముడిసరుకునే నేరుగా రైతుల వద్ద నుంచే కొనుగోలు చేస్తారు. ఎక్కువ శాతం సేంద్రీయంపైనే దృష్టి పెడతారు. పచ్చళ్ల తయారీలో ఫ్రూట్స్, కూరగాయలను పచ్చిగా ఉన్నప్పుడు తెచ్చి సహజ పద్ధతిలో వాటిని నిల్వ ఉంచిన తర్వాతనే పచ్చళ్లను పెడతారు. ఈ క్రమంలో ఆ కూరగాయలు పండించడంలో కెమికల్ శాతాన్ని కూడా శాస్త్రీయ పద్ధతిలో పరిశీలించిన తర్వాతనే ముందుకు వెళతారు



మిల్లెట్స్‌తో తయారు చేసిన తినుబండారాలు



మిల్క్ ప్రొడక్ట్స్ తయారీలో విద్యార్థులు



వంట పనుల్లో బిజీబిజీగా

ఆరు యూనిట్లుగా....

సిరెల్స్ యూనిట్ కింద ఇన్‌స్టెంట్ దోశ మిక్స్, స్నాక్ ఐటెమ్స్ పూతరేకులు, జంతికలు, చెక్కలను విద్యార్థులు తయారు చేస్తారు. వీటికి కావాల్సిన ముడి పద్దార్థాలన్నింటిని కూడా నేరుగా పొలాల నుంచే సేకరించి వంటకాలు తయారు చేస్తారు. ఫ్రూట్స్ అండ్ వెజిటెబుల్స్ కింద ఔషధ గుణాలున్న కాకరకాయ పచ్చడి, మునగాకు పచ్చడితో పాటు ఉల్లి కారం, నిమ్మ, మామిడి, ఉసిరి లాంటివన్నీ కూడా తయారు చేస్తారు. మిల్లెట్స్ కింద రాగి పిండి, తృణధాన్యాలతో తయారు చేసిన లడ్డూలు, మిక్స్‌డ్ పొడి వంటివి పూర్తినాణ్యతతో తయారు చేస్తారు. మీట్ యూనిట్ కింద చికెన్, ప్రాన్స్ పచ్చడి పోషక విలువలున్న పీతలతో నిల్వ ఉండే విధంగా పచ్చడిని తయారు చేయడం ఈ ఫుడ్ సైన్స్ విద్యార్థుల ప్రత్యేకత. ఇక స్పైసెస్ కింద పసుపు, కారం వాటి వాటిని ముడిసరుకు తెచ్చి విద్యార్థులే స్వయంగా మర ఆడించి ప్యాక్ చేసి అందుబాటులోకి తెస్తారు. పాల పదార్థాలకు సంబంధించి బాదంమిల్క్, పాలకోవాతో పాటు సబ్జా లస్సీ వంటివాటిని నాణ్యతతో తయారు చేసి మార్కెట్‌లోకి తెచ్చే విధంగా వీరి తయారీ విధానం ఉంటుంది.



విద్యార్థులు తయారు చేసిన వివిధ రాకాల ఆహార ఉత్పత్తులు

బయటకు....ఈ అభినవ నలభీములకు తేడా...

వ్యాపారంలో లాభాలతో పాటు విలువలు అనే నాణ్యత, ఆరోగ్యం మూల సూత్రం ఆధారంగానే వీరి కోర్సు మొత్తం సాగుతోంది. మారిన అభిరుచుల నేపథ్యంలో మార్కెట్‌లో ధరల గురించి ప్రజలు ఆలోచించడం లేదు. నాణ్యతకు పెద్దపీట వేసి ఆరోగ్యానికి హాని చేయని పదార్థాలను రుచిగా అందించగలిగితే విజయం సాధించినట్లే. వీటిని ఆధారంగా చేసుకనే ఈ కళాశాల విద్యారుథులు ఆయా వంటకాల తయారీలో అనుభవం గడించి ఆ రుచుల ఆస్వాదన కోసం మనల్ని సిద్ధం చేస్తున్నారు

విదేశాలలోనూ అధ్యయనం....

బాపట్లలోని ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలనుంచి ప్రతి ఏడాది పదుల సంఖ్యలో విద్యార్థులను ఇతర దేశాలతోపాటు భారత్‌లోని ఇతర రాష్ట్రాల ఆహార అలవాట్లు, అక్కడ వంటకాల తయారీలో అవలంభిస్తున్న విధానాల పట్ల అవగాహన కల్పిస్తారు. ఇందుకు అయ్యే ఖర్చును యూనివర్సిటీయే భరిస్తుంది. తొలి మూడేళ్ల కోర్సుల్లో భాగంగా డిల్లీ, బెంగళూరు, చెన్నై, యూపీ, గుజరాత్ తదితర ప్రాంతాలకు విద్యార్థులను తీసుకెళ్లి అక్కడ ఆహార తయారీ విధానాలపై అధ్యయనం చేయిస్తారు. చివరి సంవత్సరం విద్యార్థులను మాత్రం తైవాన్, థాయిలాండ్, నెదర్లాండ్ వంటి విదేశాలకు తీసుకెళ్లి అక్కడి వంటకాల తయారీ పరిస్థితులను నేర్చుకునేటట్లు చేస్తారు.

ఈ విద్యార్థులే ఎంటర్ ప్రెన్యూర్‌లుగా....

ఈ కళాశాల నుంచి డిగ్రీ పట్టాతో బయటికెళ్లే విద్యార్థులకు విస్తృత అవకాశాలు ఉండడంతో పాటు సొంతగా ఎంటర్ ప్రెన్యూర్స్‌గా కూడా మారి మరికొంతమందికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అడుగేస్తున్నారు. పలు స్టార్ హోటల్స్‌లో క్వాలిటీ చెకప్ విభాగంలో కానీ, లేదంటే ప్రభుత్వం వైపు నుంచి ఆహార నాణ్యతా ప్రమాణాల విభాగంలో కానీ ఉపాధి లభించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

కన్నుల పండువగా మహారుద్రాభిషేకం

❖ వేలాదిగా తరలివచ్చిన భక్తులు

వినుకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీకమాసం సందర్భంగా వినుకొండలో శంఖం, ఢమరుకం, ఘంటానాదం, మంగళ ధ్వనులతో అశేష జనవాహిని మధ్య మహాదేవుని మహా రుద్రాభిషేకం, భస్మాభిషేకం నేత్రపర్వంగా ఆదివారం జరిగింది. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో అమ్మ ఛారిటబుల్ ట్రస్టు నిర్వహణలో స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సహకారంతో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. అమ్మ ట్రస్టు వ్యవస్థాపకులు జ్ఞానప్రసన్న స్వామిజీ తన శిష్యులతో ఈ మహా రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకలో ఏడు అడుగుల మృత్తికా శివలింగానికి ప్రత్యేకపూజలు చేశారు. శివలింగానికి పసుపు, కుంకుమ, భస్మం, ఫల రసాలు, పలు రకాల పూలు, లక్ష రుద్రాక్షలు, గంధం, సుగంధ ద్రవ్యాలు, జలాలతో మహా రుద్రాభిషేకం కొనసాగింది. అనంతరం శివుడికి హారతి, నైవేద్యం, పట్టాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో తరలి వచ్చిన భక్తులు, హర హర మహా దేవ శంభోశంకర నినాదాలతో జూనియర్ కళాశాల ప్రాంగణం దద్దరిల్లింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడు తూ జ్ఞాన ప్రసూన స్వామిజీ 30 ఏళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు, ఆకలితో వచ్చిన వారికి అన్నం పెట్టడం, అనాధ పిల్లలను చదివించడం వంటి ఎన్నో అమ్మ ఆశ్రమం ద్వారా చేపడుతున్నారని, అందుకు ఆయనను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. రామలింగేశ్వర స్వామి గుడి అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు ఇచ్చిన సీఎం చంద్రబాబుకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. ఈ సందర్భంగానే ఫిరంగిపురం మండలం వేమవరంలో జ్ఞానప్రసన్న స్వామిజీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కోటిలింగాల ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. తన వంతుగా దేవాలయం నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే జీవీ ఈ సందర్భంగా ప్రకటించారు.



మృతికా శివలింగానికి అభిషేకాలు చేస్తున్న స్వామీజీలు



మహారుద్రాభిషేకం కార్యక్రమానికి హాజరైన భక్తులు

తీరం.. జనసంద్రం

- పోటెత్తిన పర్యాటకులు, భక్తులు
- సెలవుదినం కావడంతో పెరిగిన సందర్శకులు
- వాహనాలతో కిక్కిరిసిన పార్కింగ్ ప్రదేశం
- ముమ్మరంగా పోలీసు బందోబస్తు
- సముద్రంలో గజ ఈతగాళ్ల గస్తీ

"ప్రముఖ పర్యాటక కేంద్రం, సూర్యలంక సముద్ర తీరం ఆదివారం పర్యాటకులు, భక్తులతో జనసంద్రంగా మారింది. కార్తీక పౌర్ణమి పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు ఒక వైపు, ఆదివారం సెలవు దినం కావడంలో విచ్చేసిన పర్యాటకులు మరోవైపు సూర్యలంక సాగర తీరాన్ని అటు ఆధ్యాత్మిక భక్తిభావంతో, ఇటు పర్యాటక కోలాహలంతో ముంచెత్తారు. భక్తులు కార్తీకమాస పుణ్యస్నానాలు ఆచరించి, పూజలు నిర్వహించగా, యువత కేరింతలు కొట్టగా, చిన్నారులు ఇసుక తిన్నెలలో ఆటలాడుతూ మునిగి తేలారు."

బాపట్లరూరల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : సూర్యలంక సాగర తీరాన్ని ఆదివారం భక్తులు, సందర్శకులు ఆక్రమించారు. ఆదర్శనగర్ నుంచి సూర్యలంక తీరం వరకు వాహనాల రాకపోకలు రద్దీగా మారిపోయింది. తీరం ఒడ్డున పార్కింగ్ ప్రదేశం వాహనాలతో కిక్కిరిసిపోయింది. దూర ప్రాంతాలు నుంచి కుటుంబ సమేతంగా పర్యాటకులు సూర్యలంక తీరానికి చేరుకొని తీరంలో పుణ్య స్నానాలను ఆచరించారు. తీరం ఒడ్డున భక్తులు కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం తీరం సమీపంలోని శ్రీ తారకేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలను చేశారు.

యువకులు, చిన్నారులు తీరం ఒడ్డున ఇసుక తిన్నెలతో ఆడుకుంటూ ఉండగా యువకులు తీరంలో అలలకు కేరింతలు కొడుతూ సంతోషంగా గడిపారు. సుమారు 30 వేలకు మంది పైగా పర్యాటకులు రావటం జరిగింది. బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు పర్యవేక్షణలో బాపట్ల రూరల్ సీఐ కే.గంగాధరరావు ఆధ్వర్యంలో పర్యాటకులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తూ నిర్వహించారు. గజ ఈతగాళ్ళు సముద్రంలో బోట్లపై తిరుగుతూ పర్యాటకుల ప్రాణ రక్షణ కోసం గస్తీని చేపట్టారు. తీరం ఒడ్డున తాత్కాలిక దుస్తులను మార్చుకునే గదులను పంచాయతీవారు ఏర్పాటు చేయగా స్నానాలు ఆచరించిన అనంతరం భక్తులకు జల్లు స్నానాలను ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తీరం ఒడ్డునే ఏర్పాటు చేశారు. సూర్యలంక తీరంలో స్నానాలు ఆచరించిన అనంతరం ఆదర్శనగర్ సమీపంలోని జీడిమామిడి తోటలు కింద కుటుంబ సమేతంగా కార్తీక వన భోజనాలను చేస్తూ ఆనందంగా గడిపారు.



సూర్యలంక సముద్రతీరంలో స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు, భక్తులు

డేటా చౌర్యంపై ఉలిక్కి పడిన పోలీస్ శాఖ

- రౌడీషీటర్ బోరుగడ్డ కస్టడీ దృశ్యాలు బహిర్గతంపై సీరియస్
- అరండల్‌పేట స్టేషన్లో టెక్నీషియన్, విలేకరిపై కేసు నమోదు

గుంటూరు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ శాఖకు సంబంధించి అత్యంత రహస్యంగా ఉంచాల్సిన డేటా చౌర్యం కావడంపై పోలీసు శాఖ ఉలిక్కిపడింది. అరండల్‌పేట పోలీస్ స్టేషన్ లోని సీసీ కెమెరాకు సంబంధించిన ఫుటేజ్ బయటకు రావడం పై పోలీస్ స్టేషన్లో కేసు నమోదయింది. ఎస్ఐ రోజాలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్నీషియన్ శేషు, ఓ పత్రికా విలేకరిపై డేటా చౌర్యానికి సంబంధించి కాపీరైట్ యాక్ట్, ఐటి యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ కేసు కు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అరండల్ పేట పోలీస్ స్టేషన్ లోనూ, అదేవిధంగా స్టేషన్ పరిధిలోను గతంలో ప్రభుత్వం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకముందు ప్రైవేట్ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా శేషు అనే వ్యక్తి సీసీ కెమెరాల టెక్నీషియన్‌గా వ్యవహరిస్తున్నారు. సీసీ కెమెరాలు గాని, అదేవిధంగా పోలీస్ స్టేషన్ లోని కంప్యూటర్లు గాని ఏదైనా సాంకేతికపరమైన సమస్య ఎదురైతే శేషుతో రిపేర్ చేయిస్తున్నారు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సంబంధించిన పాస్వర్డ్ కూడా శేషు వద్దే ఉంటుంది. ఇదిలా ఉంటే ఇటీవల స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సీతారామయ్యపై ఓ పత్రిక విలేకరి పలు వరుస కథనాలు రాయడంతో పోలీసు అధికారులు సదరు విలేకరిపై దృష్టి పెట్టారు. ఆ విలేకరి గతంలో నగరంలో సిటీ బస్సుకు సంబంధించిన ఇరువురు యజమానుల మధ్య తలెత్తిన వివాదంలో జోక్యం చేసుకొని ఒకరి తరుపున పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయించడం, ఈ విషయం ఇరువర్గాల మధ్య వివాదాస్పదమయింది. తాజాగా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సీతారామయ్య పై కథనాలు రాసిన నేపథ్యంలో గతంలో జరిగిన వివాదాన్ని బయటకు తీసి ఇటీవల ఆ విలేకరిపై అరండల్ పేట పోలీస్ స్టేషన్ లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేవలం పోలీసులు కక్ష సాధింపు చర్యలో భాగంగా తనపై తప్పుడు ఎస్సీ ఎస్టీ కేసు బనాయించారని భావించిన సదరు విలేకరి తనకు పరిచయం ఉన్న సీసీ కెమెరా టెక్నీషియన్ శేషు ద్వారా ఇటీవల పోలీస్ కస్టడీలో బోరుగడ్డ అనిల్ ఉన్నప్పుడు స్టేషన్ లో చోటు చేసుకున్న పరిణామాలను సీసీ కెమెరా ఫుటేజ్‌ను బయటికి తీయించాడు. అందులో పోలీస్ స్టేషన్లో అనిల్ కుమార్ బల్లపై నిద్రించిన దృశ్యాలకు సంబంధించిన ఫుటేజ్‌ను బయటకు ఇవ్వడంతో అవి సోషల్ మీడియాలో వైరల్ కాగా, అదేవిధంగా మీడియాలోనూ పెద్ద ఎత్తున ప్రసారమయ్యాయి. బోరుగడ్డ వ్యవహారంలో పోలీస్ శాఖలో వరుసగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై ప్రభుత్వం కూడా సీరియస్‌గా ఉండడంతో అరండల్ పేట సీఐ కే శ్రీనివాసరావును విఆర్ కు పంపుతూ ఐజి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, సీసీ కెమెరా ఫుటేజ్ ను బయటకు ఇచ్చిన టెక్నీషియన్ శేషును పోలీసులు శనివారం రాత్రే అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విలేకరి అడగడంతోనే తాను ఇచ్చినట్లు శేషు అంగికరించినట్లు తెలిసింది. దీంతో పోలీసులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు. ఈ కేసులో త్వరలోనే ఆ విలేకరిని కూడా అరెస్టు చేసే అవకాశం ఉంది.



నాగార్జున సాగర్ కాలువ

నీటితీరువా వసూళ్ళలో... గందరగోళం

సత్తెనపల్లి నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వీఆర్వోల పర్యవేక్షణలో జరిగే నీటి తీరువా వసూళ్ళను వైసీపి ప్రభుత్వం రెండు సంవత్సరాల క్రితం గ్రామ సచివాలయాలకు అప్పగించడంతో అరఎకరం భూమికి ఏడాదికి 100 రూపాయలు చెల్లించే రైతు సర్వీస్ చార్జీ రూపంలో మరో 35 రూపాయలు కలిపి 135 రూపాయలు చెల్లించాల్సి వస్తుంది. చెల్లించడంలో ఆలస్యం అయితే రైతులు కట్టవలసిన నగదుకు 6 శాతం వడ్డీ వేసి సచివాలయంలో వసూళ్లు చేస్తున్నారు. అసైన్డ్ భూములకు నీటితీరువా వసూళ్ళు చేయకపోవడంతో పంట రుణాలు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏట జూన్ ప్రారంభం నుంచి మరుసటి ఏడాది జూలై నెల చివరి వరకూ ఏడాది పాటు నీటి తీరువా వసూళ్ళను ఒక పద్ధతిగా చేస్తుంటారు. ప్రస్తుతం 1432వ ఫసలి నడుస్తున్నది. వరి సాగుకు ఏడాదిలో రెండు పంటలకు సాగునీరు విడుదల చేస్తే ఎకరానికి 350 రూపాయలు నీటితీరువాగా వసూళ్ళు చేస్తారు. ఖరీఫ్ పంటకు మాత్రమే సాగునీరు ఇస్తే ఎకరానికి రెండు వందల రూపాయలు వసూలు చేయాల్సి ఉంది. చేపల చెరువులకు ఏడాదికి ఎకరానికి 500 రూపాయలు వసూలు చేస్తారు. ప్రస్తుతం సచివాలయాల ద్వారా వసూళ్లు చేస్తున్న నీటి తీరువాలో పలు ఇబ్బందులున్నాయి. రైతుకు 4ఎకరాల భూమి ఉంటే సాంకేతిక తప్పిదాల కారణంగా 3 ఎకరాలు మాత్రమే అడంగళ్‌లో చూపుతుంది. నీటి తీరువా చెల్లించే సమయంలో ఈ 3 ఎకరాలకే శిస్తు కట్టించుకుంటున్నారు. దీంతో ఎకరం భూమి తన పేరున ఉన్నా ఆన్‌లైన్‌లో కనిపించక పోవడంతో నీటి తీరువా చెల్లించేందుకు రైతులకు అవకాశం లేకుండా పోయింది. గతంలో అసైన్డ్, పోరంబోకు భూములకు కూడా వీఆర్వోలు నీటి తీరువా వసూలు చేసేవారు. రసీదులు కూడా ఇచ్చే వారు. ప్రస్తుతం పట్టా భూములు, అవి కూడా అడంగళ్‌లో నమోదై ఉన్న భూములకు మినహా ఇతర కేటగిరిలో ఉన్న భూములకు నీటి తీరువా వసూళ్ళను రెండేళ్ళుగా నిలిపివేశారు. నీటి తీరువా ప్రతి ఏటా కడితే భూమి తమదేననే ధైర్యం రైతులకు ఉంటుంది. అసైన్డ్, ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటున్న చిన్న పాటి రైతుల నుంచి నీటితీరువా కట్టించుకోక పోవడంతో సహకార సంఘాలు, వాణిజ్య బ్యాంకులలో రైతులకు పంట రుణాలివ్వడం లేదు. రైతులు రుణాల కోసం స్థానిక వడ్డీ వ్యాపారులపై ఆధారపడవలసి వస్తుంది. రైతుల ఇబ్బందులను గుర్తించి కూటమి ప్రభుత్వం అసైన్డ్ భూములకు నీటితీరువా కట్టించుకునేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.



పత్తిపంట

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు: ఎక్సైజ్ ఎస్ఐ

ఈపూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈపూరు సర్కిల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ కే శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సర్కిల్ పరిధిలోని మద్యం షాపులను ఆదివారం ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎమ్మార్పీ ధరలు కన్నా అధికంగా అమ్మిన, 21 సంవత్సరాలు నిండని వారికి మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్‌డీపీఎల్ మద్యం, నాటుసారా గురించి సమాచారం ఉంటే తెలియజేయాలన్నారు. అక్రమ మద్యం, నాటా సారాయికి సంబంధించి ఈ నెలలో మూడు కేసులు నమోదుచేసి ఇద్దరిపై బైండోవర్ నమోదు చేశామన్నారు.

గృహాల మధ్య మురుగు నిల్వ

● దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు

ఈపూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్ల బీసీ కాలనీలో గృహాల మధ్య మురుగునీరు నిల్వ ఉంది. దీంతో చుట్టుపక్కల నివశించే వారు తరచూ వ్యాధుల బారిన పడుతున్నారు. వర్షాకాలం, ఎండాకాలం అనే తేడా లేకుండా నీరు చేరి కుంటను తలపిస్తోంది. దీనివల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. అదేవిధంగా పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలకు ఆనుకుని మురుగునీటి కుంట, చెత్తదిబ్బలు ఉన్నాయి. వాటి నుంచి వచ్చే దుర్వాసనతో పిల్లల అనారోగ్యానికి కారణమౌతున్నాయి. దీనిపై తల్లితండ్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థులు, చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కొచ్చెర్ల ప్రాథమిక పాఠశాల పక్కన మురుగునీరు, చెత్తదిబ్బలు



మురుగునీటిని లేకుండా చేయాలి

● ఎన్.అంకారావు, గ్రామస్థుడు

పాఠశాల పక్కన, గృహాల మధ్యలో ఉన్న మురుగునీటిని తొలగించి ప్రజ ల ఆరోగ్యాన్ని కాపాడాలి. గ్రామంలో పారిశుద్యం అధ్వానంగా ఉండటంతో ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారు.



ఆటో బోల్తా: ఒకరికి తీవ్ర గాయాలు

నరసరావుపేట లీగల్, నవంబరు 10: పట్టణంలోని పల్నాడు చెక్‌పోస్టు వద్ద అతి వేగంగా వెళుతున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో పట్టణంలోని ప్రశాంతినగరుకు చెందిన రాఘవేంద్రరావు తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న మొదటి పట్టణ పోలీసులు క్షతగాత్రుని పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బాలాజీసింగ్ అనే ఆటో డ్రైవర్ తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకొని రాయపాడు వెళుతూ పాత చెక్ పోస్టు వద్ద ఎదురుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో రాఘవేంద్రరావుకు తీవ్ర గాయాలయ్యాయి. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మొదటి పట్టణ ఎస్ఐ అరుణ తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో తిమ్మాపురం ప్రసన్నాంజనేయస్వామి

తిమ్మాపురంలో భాగవత సప్తాహ మహోత్సవం

తిమ్మాపురం (యడ్లపాడు), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురంలో ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో 46వ భాగవత సప్తాహ వార్షికోత్సవ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కార్తీకమాసం ప్రారంభమైన 5వ రోజు నుంచి ఏకాదశి వరకు ఏడు రోజుల పాటు ఈ సప్తాహ కార్యక్రమాలను ప్రతి ఏటా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. భాగవత సప్తాహ పఠనంతోపాటు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అంతేగాకుండా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన యాగశాలనందు ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శాంతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి నాగవల్లీదళాలతో అర్చన చేశారు. ఈ సందర్భంగా పావులూరి నాగేశ్వరరావు భాగవత పఠనం గావించగా మహిళలు పెద్దఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎగువ నుంచి 785 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరు తుందన్నారు. ప్రాజెక్టు వద్ద 10 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 587.20 అడుగులు ఉంది. ఇది 305.62 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3608 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 15,928 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 15,928 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

పిడుగురాళ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూలకల్లు గ్రామానికి చెందిన చల్లా మణిమ్మకు, ఆదే గ్రామానికి చెందిన రెడ్డి లక్ష్మారెడ్డికి పాత కక్షల నేపథ్యంలో ఆదివారం ఏర్పడిన ఓ వివాదం ఘర్షణకు దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముందుగా పొలం వద్ద లక్ష్మారెడ్డికి, మణిమ్మకు ఏర్పడిన వివాదంలో మణిమ్మను లక్ష్మారెడ్డి అసభ్య పదజాలంతో దూషించాడు. ఆ తర్వాత మణిమ్మ గ్రామంలోకి వెళ్లి తన కుమారుడైన రాజేష్‌కు, బంధువులైన వీరయ్యలకు విషయం చెప్పగా వారు లక్ష్మారెడ్డిపై దాడికి పాల్పడ్డారు. గాయాపాలైన లక్ష్మారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకట్రావు తెలిపారు.

సాగరమాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు

మాచర్లరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లోని సాగరమాత ఆలయంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ భక్తులకు దైవ సందేశం అందించారు.

నీతి, నిలకడ లేని రాజకీయాలతో అభివృద్ధికి చేటు

● 20లోపు ఎన్‌టీఆర్ సృజల స్రవంతి ప్రారంభం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నీతి, నిలకడ లేని మనుషుల రాజకీయాలతో ఎంత చేటో, అభివృద్ధికి ఎంత విఘాతమో ప్రజలు గమనించాలని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. ఆదివారం పట్టణంలో తాగునీటి చెరువు వద్ద ఉన్న ఎన్‌టీఆర్ సృజల స్రవంతిని ప్లాంట్ వద్ద నీటిశుద్ధి యంత్రాలను, వాటికి జరుగుతున్న మరమ్మతులను టీడీపీ నాయకులతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిలకలూరిపేట ప్రజలకు ఈ నెల 20వ తేదీలోపే శివారు ప్రాంతాలు సహా ఎన్‌టీఆర్ సృజల స్రవంతి ద్వారా సురక్షిత తాగునీరు అందించనున్నామన్నారు. స్థానిక అవినీతి మంత్రి నిర్వాకాల కారణంగా నిలిచిపోయిన పథకాన్ని పూర్తిస్థాయిలో పునఃప్రారంభిస్తున్నామన్నారు. ఈ పథకం నిరుపయోగంగా ఉండటం వల్ల మరమ్మతులకు కూడా పనికి రాకుండా చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యేగా, మంత్రిగా విడదల రజిని చేసిన పాపాలకు ఇదొక సాక్ష్యం అన్నారు. ఎన్నికలకు ఆరు నెలల ముందే నియోజకవర్గాన్ని కూడా వదిలివేసి పోయిన మనిషి మళ్ళీ ఏ మొఖం పెట్టుకొని ఇక్కడకు వస్తున్నారో కూడా అర్థం కావటం లేదన్నారు. ఆ రోజు ప్రజలు దాహంతో ఉండకూడదని సొంత డబ్బులతోనైనా పథకాన్ని నడిపిద్దామంటే తప్పుడు కేసులతో వేధించటం మరచిపోలేదన్నారు. రాష్ట్రంలో కుప్పం తరువాత చిలకలూరిపేటలోనే ఈ పథకం పునఃప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ ఆర్గనైజర్ రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు జవ్వాజి మదన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్ సృజల స్రవంతి తాగునీటి ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి తదితరులు

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురుషోత్తమపట్నం ఉసిరితోటలో కార్తీక మాసం సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం, ది టెక్స్‌టైల్స్ డీలర్స్ అసోసియేషన్ షటిల్ బాడ్మింటన్ ఫ్యామిలీ మెంబర్స్ కార్తీక వన సమారాధన కార్యక్రమంలో ఆదివారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో నిలపాలి

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6వ తేదీ వరకు జరిగిన ఎమ్మెల్సీ ఓట్ల నమోదును నేతలంతా విజయవంతంగా చేపట్టారని, అదే స్ఫూర్తిగా ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశించారు. ఆదివారం తన నివాసంలో జరిగిన క్లస్టర్ అధ్యక్షుడు, మండల పార్టీ అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు రానున్న పది రోజులు అవిశ్రాంతంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలన్నారు. సమావేశంలో నియోజక వర్గ సమన్వయ కర్త నెల్లూరి సదాశివరావు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహ కార్యదర్శి షేక్ కరిముల్లా, నియోజక వర్గ అబ్జర్వర్ ఉషారాణి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ ఎస్ఎస్ సుభానీ, పట్టణ అధ్యక్షుడు పఠాన్ సమద్‌ఖాన్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను పునరుద్ధరించాలి

యడ్లపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ వైద్యులు ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ తరగతులను పునరుద్ధరించాలని రాష్ట్ర ఆర్ఎంపీ, పీఎంపీ, పట్టణ, గ్రామీణ వైద్యుల ఐక్యవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ జి మరళి కోరారు. ఈ మేరకు చిలకలూరిపేట నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రత్తిపాటిని ఆదివారం సంఘ సభ్యులతో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017లో టీడీపీ ప్రభుత్వం గ్రామీణ వైద్యులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని నిర్ణయించి జీవో కూడా విడుదల చేసిందన్నారు. అయితే కొన్ని కారణాల వలన శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించకుండానే నిలుపుదల చేయడం జరిగిందన్నారు. అర్హతగల వైద్యులు లేని పట్టణ మురికివాడలు, మారుమూల గ్రామీణ ప్రాంతాలలో ఆర్ఎంపీ, పీఎంపీలు దశాబ్దాలుగా వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. వారికి శిక్షణతో మరింత మెరుగ్గా సేవలందిస్తారన్నారు. అంతేగాకుండా అర్హత కలిగిన వారికి ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖలో కమ్యూనిటీ హెల్త్ ప్రొవైడర్స్‌గా అవకాశం కల్పించాలని కోరారు. ఈ నెల 11 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలలో జీవో చర్చకు వచ్చేలా చేసి శిక్షణ తరగతులు తిరిగి ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా కార్యవర్గ సభ్యులు బాజీ, వాసు, రఫి, మారుస్, ఖాసిం తదితరులు ఉన్నారు.

లక్ష సభ్యత్వాలే లక్ష్యంగా పార్టీ కేడర్ పనిచేయాలి

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఈసారి కనీసం లక్ష సభ్యత్వాలు లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో వినుకొండ నియోజకవర్గంలో 67వేలు సభ్యత్వాలు చేయించామని, ఈసారి ఆసంఖ్య దాటించేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. లక్ష సభ్యత్వాల్ని ఎలా చేరుకోవాలనే కార్యక్రమంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు ప్రతి 4ఓట్లలో ఒకరికి టీడీపీ సభ్యత్వం ఉండేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అనంతరం రూ.లక్ష చెల్లించి పార్టీ జీవితకాలం సభ్యత్వం తీసుకున్న నాయకులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. సభ్యత్వం తీసుకున్న వారిలో ఈపూరు మండలం గోపువారిపాలెం గ్రామ సర్పంచి గోనుగుంట్ల శ్రీనివాసరావు, అంగలూరు మాజీ సొసైటీ అధ్యక్షుడు అబ్బూరి శ్రీనివాసరావు (గుండేపల్లి), సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు కాకుమాను రామారావు (బొగ్గరం) లక్ష రూపాయలు చెల్లించి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చేతులు మీదుగా జీవితకాలం సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆంజనేయులు అభినందించారు. కార్యక్రమంలో పార్టీ క్లస్టర్లు, యూనిట్ ఇన్‌చార్జులు, మండల, గ్రామ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లక్ష రూపాయలు చెల్లించి పార్టీ సభ్యత్వం తీసుకున్న నాయకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఎంపికైన రమణారావుకు అభినందనలు

వినుకొండ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ స్టాండింగ్‌కౌన్సిల్‌గా నూతనంగా ఎంపికైన న్యాయవాది నక్కా రమణారావును ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గం సమన్వయకర్త నాగశ్రీను రాయల్, పార్టీ నాయకులు పాల్గొని రమణారావుకు అభినందనలు తెలిపారు.

పొగాకు నారుకు పెరిగిన డిమాండ్

● గత ఏడాది గిట్టుబాటు ధరతో పొగాకు సాగుకు మొగ్గు

● తగ్గిపోతున్న పత్తి, మిరప పైర్లు



పేరూరుపాడులో పొగాకు నారుమళ్ళు సాగుచేస్తున్న రైతులు

బొల్లాపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతాల్లో రైతులు అనేక మంది మిరప, పత్తి పంటలకు ప్రత్యామ్నాయంగా పొగాకు పంటల వైపు మొగ్గు చూపుతుండటంతో మండలంలో పొగాకు నారుకు డిమాండ్ పెరిగింది. గతంలో పొగాకు నారు అధిక ధర పలకటంతో రైతులు ఈ ఏడాది ముందుగా మేల్కొని వారి సొంత పొలాల్లోనే పొగాకు నారుమళ్ళు పోసి సిద్ధం చేసుకున్నారు. ఈ ఏడాది పొగాకు సాగు విస్తీర్ణం పెరిగింది. గత ఏడాది పొగాకు పంటకు గిట్టుబాటు ధర లభించడంతో పండిన పంటను కొనుగోలు చేసేందుకు అనేక కంపెనీలు ముందుకు రావటం, ఆశించిన మేర దిగుబడులతో పాటు గిట్టుబాటు ధర కూడా ఉండటంతో పొగాకు సాగుకు గిరాకీ పెరిగింది. గత సంవత్సరం సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో అధిక వర్షాలు, చీడ పీడలతో పత్తి పంట పూర్తిగా దెబ్బతినటంతో కొంతమంది రైతులు పొగాకు సాగువైపు మొగ్గు చూపారు. ఈ ఏడాది మిర్చి రైతులతో పాటు అపరాలు సాగుచేసే రైతులు కూడా పొగాకు పంటలు సాగు చేసేందుకు సన్నద్ధమయ్యారు. పొగాకు పంటకు కూలీల కొరత ఉన్నప్పటికీ పెట్టుబడులకు సైతం వెనుకాడకుండా రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. రెండు నెలలుగా భారీ వర్షాలు కురుస్తుండంతో నాటిన పైర్లు కుళ్లిపోయినప్పటికీ మరలా నారు తెచ్చి నాట్లు వేస్తున్నారు. మండలంలో గత ఏడాది 1750 ఎకరాల్లో పొగాకు పంటను సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 1407 ఎకరాలు పొగాకు సాగుచేశారు. రబీలో 2550 ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నట్లు అధికారులు అంచనా.



బొల్లాపల్లిలో సాగు చేస్తున్న పొగాకు పైరు

ముటుకూరులో మెగా వైద్య శిబిరం

నరసరావుపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దుర్గి మండలం ముటుకూరులో అమూల్యా నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తనయుడు డాక్టర్ చదలవాడ ఆదిత్య ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాన్ని మాచర్ల ఎమ్మెల్యే తనయుడు జూలకంటి గౌతమ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గంలో ప్రజలకు సేవ చేయడంతో పాటు పేదలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తూ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రజల మన్నలను పొందారన్నారు. అదే విధంగా తండ్రి బాటలో పేదలకు సేవలు అందిస్తున్న డాక్టర్ చదలవాడ ఆదిత్యను అభినందనీయుడన్నారు. డాక్టర్ చదలవాడ ఆదిత్య మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. తన తండ్రి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్ఫూర్తితోనే ఇదంతా సాధ్యమైందన్నారు. పేదలకు సేవ చేయడం కోసమే వైద్యవృత్తిని ఎంచుకున్నానని ఈ సందర్భంగా ఆదిత్య చెప్పారు. కార్యక్రమాన్ని ప్రారంభించడానికి వచ్చిన గౌతమ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభించిన జూలకంటి గౌతమ్‌రెడ్డిని సత్కరిస్తున్న డాక్టర్ చదలవాడ ఆదిత్య తదితరులు

త్రికోశ్వరుని దర్శించుకున్న మహిళా అఘోరి

నరసరావుపేట రూరల్, నవంబరు 10: (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని మహిళా అఘోరి ఆదివారం సాయం దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ హిందూ దేవాలయలను ధ్వంసం చేస్తున్నారని ఆదివారం కూడా తెలంగాణలోని శంషాబాద్ వద్ద పోచమ్మ తల్లి దేవాలయంను ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. హిందువులందరూ ఏకం కావాలన్నారు. సనాతన ధర్మాన్ని, స్త్రీని, గోవులను కాపాడటానికి తన ప్రాణాలను పణంగా పెడతా నన్నారు. ఆడపిల్లలను కాపాడుకోవాలని, గోహత్యలను అరికట్టాలని కోరారు. స్త్రీ శక్తి చాలా గొప్పదని, ఆ శక్తి ఒకసారి బయటికి వస్తే ఎవరూ తట్టుకోలేరని అన్నారు. తెలంగాణలో ఆరు గుళ్ళు ధ్వంసం అయ్యాయని ధ్వంసమైన గుళ్ల వద్ద మహాతాండవం ఆడబోతున్నట్లు ఆమె ఈ సందర్భంగా వెల్లడించారు.

హైవేలో ప్రమాదాల నివారణకు చర్యలు

● ఎస్ఐ అశోక్



రొంపిచర్ల, నవంబరు 10: మండలంలోని హైవే వెంబడి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ దమ్మాయి అశోక్ ఆంధ్రజ్యోతికి ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రశ్న: మండలంలో చోరీలు అధికంగా జరుగుతున్నాయి, దీనిపై మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జవాబు: రెండు చోట్ల దొంగతనాలు జరిగాయి. ఒకరిని అదుపులోకి తీసుకొని సొమ్మును రికవరీ చేశాం. మరొకరిని కొద్ది రోజుల్లో అదుపులోకి తీసుకుంటాం.



ప్ర: హైవేపై ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జ: మండలంలోని రొంపిచర్ల, సుబ్బయ్యపాలెం, వీరవట్నం, కర్లకుంట అడ్డరోడ్డు, సంతగుడిపాడు, విప్పర్ల, మర్రిచెట్టుపాలెం గ్రామాల సమీపంలో హైవేపై తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ గ్రామాల సమీపంలో హైవేపై లైట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆర్అండ్‌బీ శాఖ అధికారులకు లేఖ రాశాము.

ప్ర: మండలంలో బెల్టు షాపులపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?

జ: మండలంలోని గ్రామాల్లో రెండుచోట్ల తనిఖీలు నిర్వహించి అదుపులోకి తీసుకున్నాం. అదేవిధంగా మండలంలోని గ్రామాల్లో బెల్టు షాపులపై తనిఖీలు నిర్వహిస్తాం.

త్రికోటేశ్వరునికి మాజీ మంత్రి కన్నా ప్రత్యేక పూజలు

నరసరావుపేట రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో మాజీమంత్రి, సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముందుగా ఆలయ అర్చకులు కన్నా లక్ష్మీనారాయణకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు, ఆలయ అధికారులు కన్నా లక్ష్మీనారాయణకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.



కోటప్పకొండలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ



మట్టితరలింపునకు వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్

అక్రమంగా మట్టి తరలింపు

ఈపూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మరాజుపల్లి సమీపంలో వినుకొండ-కారంపూడి ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన ప్రభుత్వ భూమిలోని మట్టిని కొందరు అక్రమార్కులు ఆదివారం అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ట్రక్కుమట్టి రూ.400 నుంచి రూ.500ల వరకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా క్వారీలు పెట్టి మట్టి తరలిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు విన్పిస్తున్నాయి. అధికారులు స్పందించి మట్టిని అక్రమంగా తరలిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నేత్రదానం అభినందనీయం

● సంద్రపాటి చలపతిరావు

వేల్పూరు (శావల్యాపురం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన వ్యక్తి నేత్రాలను మరొకరికి దానంచేసి చూపును ప్రసాదించడం అభినందనీయమని అమ్మ నేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కో ఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన కంచుమాటి దొప్పలపూడి లింగమ్మ(82) వృద్ధాప్యంతో ఆదివారం మృతిచెందగా ఆమె కుటుంబసభ్యులు లింగమ్మ నేత్రాలను దానం చేశారు. చలపతిరావు ఇచ్చిన సమాచారంతో పెదకాకాని శంకర్ ఆసుపత్రి ఐ బ్యాంక్ వైద్యురాలు వందన తమ సిబ్బందితో వచ్చి లింగమ్మ కళ్లలోని కార్నియా పొరలు సేకరించారు. డాక్టర్ వందన మాట్లాడుతూ నేత్రదానం చేయడాన్ని ప్రజలంతా కర్తవ్యంగా భావించాలని, నేత్రదానం చేయదలచినవారు మృతదేహాన్ని ఏసీబాక్స్‌లో ఉంచి 8గంటల్లోపు నేత్రదానం చేయాలన్నారు. వ్యక్తి చనిపోయిన వెంటనే ఐ బ్యాంక్ సిబ్బందికి సమాచారమివ్వాలన్నారు. లింగమ్మ కుటుంబసభ్యులను దొప్పలపూడి శ్రీనివాసరావు, నాగమ్మ, అంజమ్మ, వెంకటేష్, ప్రమీళలను డాక్టర్ వందన, సిబ్బంది, చలపతిరావు, గ్రామపెద్దలు అభినందించారు.



నేత్రదానం చేసిన లింగమ్మ



గాంధీ పార్కు వద్ద ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులకు సంఘీభావం తెలియజేస్తున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీ ప్రేమ్‌కుమార్ తదితరులు

104 సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

● యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆంజనేయులు నాయక్

నరసరావుపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 104 సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్ ఆంజనేయులు నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం యూనియన్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట గాంధీ పార్కు ధర్నా చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ 16 ఏళ్లక్రితం 2008లో 104 వ్యవస్థ ప్రారంభమైందని, ప్రారంభ దశలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ఆధ్వర్యంలో ప్రభుత్వమే నడిపిందన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అరబిందో ప్రైవేట్ సంస్థకు అప్పగించిందన్నారు. ప్రైవేట్ సంస్థకు అప్పగించడం వలన 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కరువైందని, సకాలంలో వేతనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కీలకమైన వైద్య రంగంలో పనిచేస్తున్న ప్రతి విభాగంలో ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీ ప్రేమ్‌కుమార్ సంఘీభావం తెలిపి, 104ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ సుభాని, కార్యదర్శి అరుణ, సాంబశివరావు, భాషా, ఏసుదానం తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలను తగ్గించాలి: సరికొండ

రొంపిచర్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిత్యావసరాల ధరలను తగ్గించాలని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ సరికొండ వెంకటేశ్వరరాజు ఆదివారం పేర్కొన్నారు. ప్రజాపోరు ప్రచార యాత్రలో భాగంగా ఆదివారం మండల కేంద్రమైన రొంపిచర్ల చెరువు కట్ట సెంటర్‌లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గించాలని, దేశవ్యాప్తంగా మహిళలపై జరిగే అత్యాచారాలను అరికట్టాలని, పెట్రోల్, డీసిల్ రేట్లను తగ్గించాలని, అర్హులైన వారికి రేషన్ కార్డులు, పింఛన్‌లు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగలూరి ఫణీంద్ర, రామిరెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు. ఈ నెల 15వ తేదీన ప్రజా సమస్యల పరిష్కారం కోసం రొంపిచర్లలో జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.